# శాంతి

# SANTI

విశ్వమానవ సౌభ్రాతృత్వ సందేశము గల ఆధ్యాత్మిక మాసపత్రిక

ఫిబ్రవరి - February - 2022

ప్రణవోధనుః శరోహ్యాత్మా బ్రహ్మతల్లక్ష్యముచ్యతే
అప్రమత్తేన వేద్ధవ్యం శరవత్ తన్మయో భవేత్

ఏకం సత్ విప్రా బహుధా వదంతి

ఒకే సత్యము అనేక విధములుగా బ్రహ్మజ్ఞులచే చెప్పబడినది.

– ఋగ్వేద సంహిత

# శాంతి

# SANTI

**విశ్వమానవ సౌభ్రాతృత్వ శాంతి సందేశ ఆధ్యాత్మిక మాసపత్రిక**

**స్థాపకులు : పరమపూజ్య శ్రీస్వామి ఓంకార్‌జీ మహరాజ్**

**సంపాదకులు : స్వామిని వినమ్రానంద**

సంపుటి / Vol. 98 ఫిబ్రవరి/February - 2022 సంచిక/No.2

| వ.నెం. | విషయ సూచిక | పేజి నెం. |
|---|---|---|
| 1. | ప్రార్థన – శ్రీ ఆదిశంకరాచార్య విరచిత శ్రీ వాగ్దేవీ స్తోత్రమ్ | 2 |
| 2. | ధ్యానము – ముండకోపనిషత్తు | 2 |
| 3. | పరమ పూజ్యశ్రీ ఓంకార్ ఆత్మకథ – అనువాదం : శ్రీమతి బొప్పన అరుణాదేవి | 3 |
| 4. | తత్వమసి – శ్రీ తెన్నేటి విశ్వనాథం | 7 |
| 5. | ఈ విశ్వమంతా నా గృహము – స్వామి ఓంకార్ | 10 |
| 6. | భగవత్ కృప – శ్రీ అఖండానంద సరస్వతీ మహరాజ్ | 13 |
| 7. | భీష్మస్తవరాజము – శ్రీ మహాభారతము | 15 |
| 8. | శ్రీ తులసీ సర్వస్వము – జి.వి.యస్. సుబ్రహ్మణ్య శాస్త్రి | 19 |
| 9. | లాడుబావా చరిత్రము | 20 |
| 10. | మాతృ ఆశ్రమ వార్తలు | 24 |
| 11. | దాతలకు విజ్ఞప్తి | 25 |
| 12. | కార్యక్రమములు, విరాళములు | 26–28 |

*** ఈ పత్రికలో ప్రచురింపబడిన వ్యాసముల యొక్క భావాలకు రచయిత్రి / రచయితలే బాధ్యులు కాని. సంపాదకులు కారు.**

**జీవిత సభ్యత్వం రూ. 1000/–లు సాలుసరి రూ.100/–**

# ప్రార్థన

## శ్రీ ఆదిశంకరాచార్య విరచిత శ్రీ వాగ్దేవి స్తోత్రమ్

### నా హృదయాన్ని నీ శాశ్వతమైన ధామంగా చేసుకో

**శ్లో.3 త్వచ్చరణాంభోరుహయో:**
**ప్రణామహీన: పున: ద్విజాతిరపి ।**
**భూయా దనేడమూక:**
**త్వద్భక్తో భవతి దేవి! సర్వజ్ఞ: ॥**

తా॥ తల్లీ! నీ చరణ సరోజములకు నమస్కరింపనివాడు ద్విజుడయినను మూగవాడయి పోవును. నీకు భక్తుడయినచో సర్వజ్ఞుడు కాగలడు.

**శ్లో.4 మూలాధారముఖోద్గత**
**బిసతంతునిభప్రభా ప్రభావతయా ।**
**విసృతలిపి వ్రాతాహిత**
**ముఖకరచరణాదికే! ప్రసీద! మమ ॥**

తా॥ మూలాధారచక్రము నుండి ఉద్భవించిన నాదశక్తి "తామర తూటి దారము" వలె అత్యంత సూక్ష్మమైనది. "బిసతంతు తనీయసీ" అని లలితా సహస్రనామాల్లో చెప్పబడిన శక్తి అదే. "నీవారశూకవత్తన్వీ" అని మంత్రపుష్ప సూక్తములో చెప్పబడిన శక్తియు అదే. ఆ 'నాదశక్తి' నుంచియే రకరకాల అక్షర సముదాయం ఏర్పడింది. ఈ అక్షర సముదాయమే సరస్వతికి శబ్దమయ శరీరము. ఈ విధముగా కుండలినీ ప్రభావంతో వెల్వడిన స్వరవ్యంజనములతో ఏర్పడిన వైఖరీ రూపముతో వైభవముగా వెలుగొందు దేవీ! నన్ను అనుగ్రహింపుము.

# ధ్యానము

## ముండకోపనిషత్తు

### ధ్యానము ద్వారా శాంతి లభిస్తుంది

మదర్చిమద్ యదణుభ్యోஉణు చ
యస్మిన్‌లోకా నిహితా తోహినశ్చ ।
తదేతదక్షరం బ్రహ్మ స ప్రాణస్తదు వాఙ్మనః
తదేతత్సత్యం తదమృతం తద్వేద్ధవ్యం సోమ్యవిద్ధి

ఆ ఆత్మ తేజోమయమైనది, అణువుల్లో కల్లా అణువైనది. లోకాలు జీవరాశులు దాన్లోనే నెలకొని ఉన్నాయి. ఆ ఆత్మ అవినాశి, ఆ ఆత్మే భగవంతుడు. ప్రాణం, వాక్కు, మనస్సు సర్వమునూ అది సద్వస్తువు, అమరమైనది. తెలుసుకోదగినది తెలుసుకో...

# శాంతి ప్రదాత శ్రీ ఓంకార్ స్వామీజీ ఆత్మకథ

**అధ్యాయం - 35**

**మూలం : స్వామి ఓంకార్** **అనువాదం : శ్రీమతి బొప్పన అరుణాదేవి**

## శాంతికేంద్రాలు మౌనం ఆత్మను దర్శింపజేస్తుంది

శాంతి కేంద్రాలు పనిచేసిన విధానాన్ని గురించి ఇక్కడ నేను, వాటి ప్రాముఖ్యం గురించి కొద్దిగా చెప్పాలనుకుంటున్నాను. భారతదేశానికి తిరిగి వచ్చేముందు ఆమెరికాలో వివిధ ప్రాంతాల్లో నేను నెలకోల్పిన శాంతి కేంద్రాలను, అవి పనిచేసిన తీరుతెన్నులను ఎందరో ఆర్తులకు, జిజ్ఞాసువులకు ఆధ్యాత్మిక శాంతిని ప్రసాదించిన వైనాన్ని ఈ ఆత్మకథ మధ్యలో చేర్చటానికి నేను ఎంతో ఆనందిస్తున్నాను. సోదరి సుశీలాదేవితో కలిసి మేము ఎన్నో శాంతి కేంద్రాలను, శాంతి ఆశ్రమానికి అనుబంధ సంస్థలను స్థాపించి భక్తుల హృదయాల్లో అంతరంగా శాంతిని నెలకొల్పామని చెప్పాలి.

అన్ని సంకల్పాల నుండి విముక్తి పొందిన వారు అదృష్టవంతులు. అన్ని సంకల్పాలకు అతీతులయిన వారికే ప్రశాంతత చిక్కుతుంది. కానీ ఈ ప్రపంచంలో భౌతిక దేహంతో జీవిస్తున్నంత కాలము ఏదో ఒక సంకల్పం, లేదా భగవంతుని పేరుతో సేవ చేయాలనే భావము వస్తుంటాయి. నా బాల్యం నుండే నాకు శాంతికేంద్రాలను స్థాపించాలనే సంకల్పం ఉండేది. కేవలం ఈ భూమి మీదే కాకుండా ప్రతి వ్యక్తి హృదయంలోనూ తూర్పు, పడమర దేశాల్లోకి వారందరికి శాంతి సందేశాలను అందించాలనే తపన ఉండేది. ప్రతి వ్యక్తి హృదయంలో శాంతి నెలకొన్నప్పుడు అది ప్రపంచ శాంతికి, విశ్వశాంతికి దారితీస్తుందని, అది తొందరగా కావచ్చు లేదా కొంత సమయము పట్టవచ్చు గాని అలాగే జరుగుతుందని నా ప్రగాఢ విశ్వాసము. అదే శ్రీశాంతి ఆశ్రమము మాకు ఆదర్శంగా నిలిచింది.

వ్యక్తిగత శాంతి ప్రపంచ శాంతికి దారితీస్తుంది. కాబట్టి ముందుగానే హృదయాన్ని శాంతితో నింపుకో. ముందు నీ ఇంటిలో శాంతిని నెలకొల్పడానికి ప్రయత్నించు. దాన్ని నీ సంఘానికి లేదా సమాజానికంతటికి అందించడానికి ప్రయత్నించాలి. ఆ విధంగా ఒక హృదయం నుండి మరొక హృదయానికి శాంతి తరంగాలను ప్రసరింపచేయాలి. నీ పవిత్రమయిన ఆదర్శవంతమయిన శాంతియుత జీవనం ద్వారా విశ్వానికంతటికి శాంతి సందేశాలు, తరంగాలు ప్రసరించి, విశ్వశాంతి కలిగే దాకా ప్రయత్నించాలి.

నా జీవితంలో అత్యంత ఆనందకరమయిన క్షణాలు, భగవంతుడు నాకు శాంతి కేంద్రాలను స్థాపించటం ద్వారా ప్రతి ఒక్క భక్తుని హృదయాన్ని శాంతితో నింపే సదవకాశాన్ని కల్పించటమే. నేను జీవితంలో ఎన్నడయినా బాధపడిన క్షణాలున్నాయి అంటే, అవి నేను మీ హృదయంలో శాంతిని నింపటంలో విఫలమయినప్పుడు, క్రొత్త శాంతి కేంద్రాలను స్థాపించడానికి విఫలమయినప్పుడు మాత్రమే అని చెప్పగలను.

మన భక్తిమయ అంకిత హృదయ క్షేత్రాలను శాంతి కేంద్రాలుగా మార్చుకొని, అక్కడి నుండి శాంతి, ప్రేమలను ఉరకలు వేసే నదుల నీరులాగా గలగల పారే జలపాతాల్లాగా మనకు ప్రియమయిన వారికి, దగ్గరలోని వారికే కాకుండా ఎక్కడో దూరంగా ఉండేవారికి, ప్రపంచంలోని మానవాళి కందరికి కూడా అందించగల్గటం ఎంతో అదృష్టం. అలాంటి వారు భగవంతుని అనుగ్రహానికి పాత్రులవుతారు.

"ప్రేమించు! ప్రేమించటానికే జీవించు" ఎంత గాఢమయిన అనుభూతి. అది కల్గినప్పుడు అందరిని ప్రేమించటము చాలా తేలికవుతుంది. కానీ ప్రేమించటం కోసమే జీవించటము చాలా గొప్ప విషయం. అది మహోన్నతమయిన స్థితి. నిజానికి మనం మన హృదయానికి బాగా నచ్చినవాళ్ళను మాత్రమే ప్రేమించి, మిగిలిన వారి గురించి పట్టించుకోము. కాని మనం ప్రేమించటానికే జీవించేటప్పుడు ప్రేమ విశ్వప్రేమగా మారిపోతుంది. ఒక్క క్షణం కూడా ఏ ఒక్కరిని మర్చిపోవటం గాని, వదలిపెట్టటం గాని, ప్రేమించకుండా ఉండడం గానీ సాధ్యం కాదు.

**విశ్వప్రేమ ఎవ్వరిని వదిలిపెట్టదు. అందరినీ ప్రేమించేలా చేస్తుంది. మాటలు అయోమయాన్ని, ద్వంద్వాన్ని, అనుబంధాన్న సృష్టిస్తాయి. కాని మౌనం ఆత్మను దర్శింప చేస్తుంది, ఆత్మ సాక్షాత్కారాన్ని అందిస్తుంది.**

మానవుని స్వయంజ్యోతి ప్రకాశంలో ఇతరులకే ప్రథమ స్థానం ఉంటుంది. ఏ మానవుడు తాను ఇతరులకు సేవ చేస్తున్నాను అని భావిస్తాడో అతడు అజ్ఞాని. అజ్ఞాని దృష్టిలో ఇతరులు ఉన్నారని అనుకోవటమే అజ్ఞానము. సృష్టి సర్వము బ్రహ్మమయము అయినప్పుడు ఉన్నది ఒక్కడే దైవము. మన బాహ్య దృష్టికి గోచరించకపోయినా అంతా బ్రహ్మమయంగా ఉంటుంది. అప్పుడు పరాయివారంటూ ఎవరుంటారు? నీవు ఎవరికయినా సేవలు అందిస్తే అది నీకు నీవు సేవ చేసుకున్నట్లే అవుతుంది.

**నీకు నేను సహాయం చేస్తే, అది నాకు నేను సహాయం చేసుకున్నట్లే. మీ అందరిని నేను ప్రేమిస్తే, నన్ను నేను ప్రేమించుకున్నట్లే.**

అందరిలో ప్రకాశిస్తున్న ఆత్మ స్వరూపాన్ని ఆరాధించు. నీ కళ్ళల్లో వెలుగులు నింపుతున్నది ఆత్మ చైతన్యమే. అది దగ్గరగా ఉంది. నీ ఆత్మ స్వరరూపంగానే ఉంది. అది నీ కంటే వేరుగా లేదు. అదే పరమాత్మ స్వరూపం. మన శ్వాసలో నిండి ఉన్న నీ ప్రతి ఉచ్ఛ్వాస నిశ్వాసల్లోనూ నీవు ఆ దైవము ఉనికిని గుర్తించగలిగితే, నీ హృదయంలోనే నిశ్శబ్దంగా కొలువై ఉన్న పరమాత్మను తెలుసుకోగలిగితే ఇక నీకు నా దగ్గరికి రావలసిన పని లేదు. ఈశాంతి కేంద్రాల అవసరం అసలు ఉండదు. ఎందుకంటే నిజమయిన శాంతి కేంద్రము నీలోపలే ఉంది. నీవు తనని ఎప్పుడు గుర్తించగలుగుతావా అని ఎదురుచూస్తుంది.

నేను నీకు నీవు సహాయం చేసుకునేందుకు సహాయము చేయాలనుకుంటున్నాను. నేను నీవు సేవ చేయాలనుకుంటున్నప్పుడు నీవు నిలబడటం నేర్చుకోవచ్చు. నీ కాళ్ళ మీద నీవు నిలబడగల్గుతావు.

నా జీవితాశయము, నా ప్రబోధాల సారాంశము నంతటిని మూడు వాక్యాల్లో చెపుతాను.

1. నా మీద ఆధారపడవద్దు. 2. ఎవ్వరి మీదా ఆధారపడవద్దు. 3. నీ అంతరాంతరాల్లో దివ్యమైన ప్రకాశంతో వెలుగొందుతున్న ఆత్మజ్యోతిపై ఆధారపడు. అది నీవు తనను గుర్తించాలని ఎదురుచూస్తోంది. నీ అణువణువులో నిండి నిబిడీకృతమై ఆత్మగా అది వెలుగొందుతోంది. ఇప్పుడు ఈ క్షణంలోనే గుర్తించు.

మనం దేనిని గురించి ఆలోచిస్తామో, అదే అవుతుంది. మనము దేనిని విత్తుతామో, ఆ పంటే వస్తుంది. మానవుడే తన కర్తకు విధాత. మన ఆలోచనలు ఎలా ఉంటాయో, పనులు కూడా ఆ విధంగానే ఉంటాయి. అందువలన మన ఆలోచనలను భగవంతుని వైపుగా మళ్ళించాలి. ఆయన మననుండి ఎన్నడూ వేరుగా లేడు అన్న విషయం అర్థం చేసుకోవాలి.

ఎవరయితే ఈ విశాల ప్రపంచాన్ని తన సొంత ఇళ్ళుగా భావిస్తారో, అందులో నివసించే వారందరిని తన సొంత సోదర సోదరీమణులుగా భావించి ప్రేమిస్తారో, వారిని సేవిస్తారో అదేనిజమయిన మతము.వారందరూ భగవదనుగ్రహం పొందుతారు.

నా ప్రపంచంలో నాకు ఎవ్వరూ గురువులు గాని శిష్యులు గాని లేరు. సృష్టిలో అందరూ భగవంతుని ప్రతిరూపాలే. ప్రతి ఒక్కరూ జ్యోతి స్వరూపాలే. నేను చెప్పాల్సిన అవసరం లేదు. మీలో ఎవరినీ నా భక్తులుగా మార్చుకోవాలనే ఉద్దేశ్యము నాకు లేదు. నాకున్న సంకల్పం కేవలం మీకు సహాయం చేయాలని. ప్రతి ఒక్కరికి సహాయం చేయాలను కుంటున్నాను. మీ లోపలున్న అంతర్జ్యోతిని ఆవిష్కరింపచేయడానికి దోహదపడాలని ఉంది. అది ఎల్లప్పుడు ప్రతి ఒక్కరిలో భగవంతుని ప్రతిరూపమయిన అందరిలో ఉంది.

నేను దైవం గురించి మాట్లాడినప్పుడు ఎక్కడో దూరంగా ఆకాశంలో, లేదా స్వర్గలోకంలోని దైవం గురించి మాట్లాడటం లేదు. లేదా ఒక మతం గురించి గాని, ఒక దేశానికి సంబంధించి గాని మాట్లాడటం లేదు. నేను దైవం గురించి చెపుతోంది అణువణువులో నిండి నిబిడీకృతమైన దైవం గురించి. అది నీవే అయివున్నావు. ఆ దైవం నీ కళ్లలో వెలుగులు నింపుతోంది. ఇప్పుడు, ఇక్కడే ఆ దివ్యానుభవాన్ని అనుభవించు. దైవము అంటే నీ బుద్ధికి బుద్ధి అయినవాడు, నీ హృదయానికి హృదయమైనవాడు. నీ శ్వాసలో శ్వాస అయినవాడు, నీ జీవితానికే జీవితమయినవాడు, నీ ఆత్మకు ఆత్మ అయినవాడు.

నీలో వెలుగొందుతున్న ఆ జ్యోతి స్వరూపం పట్ల నిజాయితీగా ఉండు. అది నీ దివ్యమయిన అంతరాత్మ. అదే నీ నిజమయిన జీవన గమ్యము, జీవిత లక్ష్యము. నీ పట్ల నీవు నిజాయితీగా లేకపోతే, నీ అంతరాత్మపై నీవు ఆధారపడకపోతే అంతరాత్మగా వెలుగొందుతున్న ఆ దివ్యజ్ఞాన ప్రకాశాన్ని నీవు గుర్తించలేకపోతే, ఏదయితే నీకు అత్యంత సమీపంగా, ఆనందమయంగా ఉందో దానిపట్ల నీవు నిజాయితీని

ప్రదర్శించలేకపోతే ఇంక ఇతరుల పట్ల, బాహ్యలోకపు వ్యక్తుల పట్ల ఏ విధంగా నిజాయితీని ప్రదర్శించగలవు? గొప్పవారి పట్ల, అవతారమూర్తుల పట్ల ఏ విధంగా భక్తి శ్రద్ధలు ప్రదర్శించగలవు? ఏ మతానికయినా నిన్ను నీవు తెలుసుకోవటమే మొదలు, మధ్య, చివర కూడా అయివుంటుంది. ఎవరయితే ఆత్మను దర్శించ గలిగారో అలాంటి మహనీయులందరికి తలవంచి నమస్కరిస్తున్నాను. ఆత్మ సాక్షాత్కారమే శాంతిని ఇస్తుంది. ధైర్యాన్ని, శక్తిని ప్రసాదిస్తుంది. అదే ఆరోగ్యాన్ని, ఆనందాన్ని దీర్ఘాయుష్షును కూడా ఇస్తుంది. ఆత్మాసాక్షాత్కారము పొందిన వ్యక్తికి ఈ లోకంలో సాధ్యం కానిది ఏమీ ఉండదు. ఆయన ఏదయినా సాధించగలడు. ఆయన వేదాంత తత్త్వానికి సింహం లాంటివాడు మేధా సంపత్తికి మారు పేరు ఆయన.

ఎవ్వరి మీదనయినా ఆధారపడటము అంటే వారు గొప్పవారయినా, పేరున్నవారయినా సరే అది బానిసత్వము, అజ్ఞానము, బలహీనత అవుతుంది. ఆత్మసాక్షాత్కారము పొందిన వ్యక్తి సింహములాగా గర్జిస్తాడు. అలాగే ఇతరులపై ప్రతిదానికి ఆధారపడేవాడు, మేకపిల్లలాగా పిరికిగా ఉంటాడు. మీ అందరూ సింహాల్లాగా గర్జించాలని, మీ ప్రేమామృతాన్ని అందరిపై వర్షించాలని, అలాగే మీరందరూ శాంతిని మానవాళికందరికి పంచిపెట్టాలని ఆశిస్తున్నాను. శాంతి అనేది ఇచ్చేవాడికే సొంతమవుతుంది కాని ఆశించేవాడికి కాదు. అందువలన మీరు ఎప్పుడూ ఇతరులకు ప్రేమను పంచేవారుగా ఉండాలి. విశ్వప్రేమ, ఆదర్శవంతమయిన జీవన విధానము, తేజోమయమయిన జ్యోతి స్వరూపంగా ఉండాలి.

మతము, వేదాంతము కూడా మానవుడిని దు:ఖమునుండి దూరం చేయలేకపోతే, అప్పుడు అతని దు:ఖానికి అతనే కారణమవుతాడు. లేదా అతడు ఆనందంగా, సంతోషంగా ఉంటున్నాడు అంటే అతడే అతని సంతోషానికి కారణము. నీవు సంతోషంగా ఉన్నావా లేదా దు:ఖంతో ఉన్నావా? నీవు దు:ఖంలో కూరుకుపోవాలని అనుకుంటే కేవలం నీ గురించే నీవు ఆలోచించాలి లేదా నీవు సంతోషంగా ఉండాలని భావిస్తుంటే ఇతరుల గురించి ఆలోచించడటం నేర్చుకో. ఇతరులను సంతోషంగా ఉంచగల్గినప్పుడే నీవు కూడా సంతోషంగా ఉండగల్గుతావు.

**ఇతరుల సంతోషమే మన సంతోషం కావాలి**

**ఇతరుల ఆరోగ్యమే మన ఆరోగ్యం కావాలి – ఇతరుల శాంతి మన శాంతి కావాలి**

ఇక నేను నా సందేశాన్ని వైదిక శాంతి మంత్రాలతో ముగిస్తూ, మీ హృదయాల్లో శాంతి సందేశాన్ని నింపటానికి ప్రయత్నింస్తాను.

**స్వర్గలోకం శాంతిగా ఉండుగాక! ఆకాశము శాంతిగా ఉండుగాక!**
**నీరంతా శాంతిగా ఉండుగాక భూమి మీద శాంతి నెలకొనుగాక!**

**శాంతి చిన్న పొదల నుండి మొక్కలకు, పెద్ద వృక్షాలకు ప్రవహించుగాక! అందరూ శాంతిమయ జీవనాన్ని కొనసాగింతురుగాక! అందరూ ప్రశాంతిగా వర్థిల్లుదురు గాక!**

# తత్త్వమసి

## శ్రీ తెన్నేటి విశ్వనాథం

(క్రిందటి సంచిక తరువాయి)

ఉ। చూచితివా? ఇది బంగారము, ఇవన్నియు బంగారము, ఇది బంగారము, ఇదీ బంగామే, కాని రూపముమార్చి నామమునిచ్చిరి. వస్తువు ఒకటే. మిగిలినది అంతా నామధేయము మాత్రమే, వాగ్వ్యాపారమే. బంగారము నిత్యమైనది; ఈ రూపము లనిత్యములై నవి. నిత్యమైనదానినే సత్యమని అనెదరు. అనిత్యమైన దానినే అసత్యమని అనెదరు

శ్వే॥ చిత్తము భగవాన్.

2వ ఋ॥కు॥ (ఇతర ఋ॥కు॥లతో) ఎంత చక్కగా చెప్పినారు! మనకుకూడ అర్థమగుచున్నది. మనకు ఎదురుగ ఉన్న విషయమేకాని మనమెన్నడు గ్రహించలేదు.

ఉ॥ (ప్రక్కనున్న ఒక వస్తువుతీసి) ఇది ఏమిటి వస్తువు కుమార!

శ్వే॥ ఇది గోళ్లు కత్తిరించుకొను కత్తెర.

ఉ॥ దేనితో చేయబడినది

శ్వే॥ నల్ల లోహముతో

ఉ॥ (మరికొన్ని వస్తువులు చూపుచు) ఇవి ఏమిటీ వస్తువులు.

శ్వే॥ ఇది గంటము, ఇది కత్తి, ఇది తోలనము (త్రాసు)

ఉ॥ ఇవి అన్నియు దేనితో చేయబడినవి.

శ్వే॥ ఆలోహముతోనే.

ఉ॥ చూచినావ? ఇది నల్లలోహము, ఇది నల్ల లోహము, ఇది నల్లలోహము, ఇదీ నల్లలోహము వేరు వేరు రూపములతో నున్నది; వేరు వేరు పేరులు గలిగియున్నది. వస్తువు ఒకటే, రూపములు వేరు ఈవస్తువు నిత్యము, ఈ రూపములు అనిత్యములు. నిత్యమైనదానినే సత్యమని అనెదరు. అనిత్యమైన దానినే అసత్యమని అనెదరు.

శ్వే॥ నాయనగారూ! మా గురువులు ఈ వస్తుస్వరూప విషయము నాకు బోధించలేదు. వారికి తెలిసియుండిన బోధించియే యుందురు కాక తెలిసియే నాకు బోధించలేదో (తండ్రి పాదములను స్పృశించి) తామె బోధింతురు గాక!

3వ ఋ॥కు॥ భగవత్స్వరూపా! మేముకూడా ధన్యులమయితిమి. తమ నిర్మలము సుబోధకము, సులభమునైన ప్రవచన శ్రవణభాగ్యము మా కింకను కలుగ జేయుడు.

ఉ॥ బాగున్నది. లోకములో చెప్పెడిదానిని వినెడు వారు చాల అరుదు. మీరు శ్రవణ కుతూహలు లైతిరి గనుక కూర్చొనుడు, సావధానులరయి.

శ్వే॥ చిత్తము భగవాన్, మనసు కొంత తేటపడు చున్నది.

ఉ॥ కుమార, వినుము. ఇది అనగా ఈ ప్రత్యక్షాది ప్రమాణములవలన మనము చూచు ప్రపంచ మంతయు, నామరూప క్రియాభేదములచే భిన్నమై కన్పించుచున్నదిగదా! అయినచో ఈ భిన్నసృష్టికి పూర్వము ఒకటిగనేయుండి యుండెను. ఇప్పుడే చెప్పితిని గదా! నామరూపక్రియలు వాగ్వ్యాపారములు, వస్తువు ఒకటే అని దృష్టాంతపూర్వకముగ అట్లు ఉండి ఉన్నదానినె 'సత్' అని పెద్దలు చెప్పుచున్నారు.

శ్వే॥ చిత్తము, కాని మొదటి అది అసన్మాత్రముగ ఉండెనని వింటిని, అసన్మాత్రమైన దాని నుండియే ఇపుడు తాము చెప్పిన సత్ పదార్థ ముదయించెననని వింటిని.

ఉ॥ నీవు విన్నది శూన్యవాదము. అది సరియైనదికాదు ఎందుకందువా? మొదట శూన్యము అయినయెడల అందుండి ఏసత్పదార్థము జనింపగలదు? జనింపజాలదు. ఇది అనుభవ వేద్యము. అందుచేత ఇది మొదట ఉండి ఉన్నదే. అయితే నామ రూప క్రియాభేదములు లేకుండ ఏకమై నిర్వికారమై అద్వితీయమై, చిన్మాత్రమై ఉండినది. ఆలాగుననే ఇపుడునుఉన్నది. ఆలాగుననే ఎప్పుడును ఉండును. ఇది అంతయు దాని అభాసయే,

శ్వే॥ మరొకమారు చెప్పుడు.

ఉ॥ శ్రద్ధగ వినుము. ఇవి ఏమిటివి. కొన్ని చిన్నవి, కొన్ని పెద్దవి.

శ్వే॥ చిత్తము.

ఉ॥ కొన్ని నిర్మలములు, కొన్ని అంతనిర్మలముగ లేవు. అంతేనా?

శ్వే॥ అవును.

ఉ॥ చూడు ఇది ఒక రంగుటద్దము. ఇది మరొక రంగు టద్దము.

శ్వే॥ అవును.

ఉ॥ చూడు, ఇది క్రిందపడి నాలుగైదు పగుళ్ళతో నున్న అద్దము.

శ్వే॥ అవును నాయనగారూ!

ఋ॥కు॥ (తమలోతాము) ఇందులో ఏదో ఉన్నది. లేకున్న ఇంతవివరణము ఎందుకు చేయుదురు మహర్షులు.

ఉ॥ చూడుడు, ఋషికుమారులార, ఈ అద్దములన్నిటిని వేరు వేరుగ అదుగో అక్కడ సూర్యబింబమునకు ఎదురుగ గోడకు చేరవేయుడు.

శే॥ నేనుకూడ పెట్టవచ్చునా?

ఉ॥ పెట్టవచ్చును. కాని ఆపెట్టినవానిని ఇక్కడనుండి చూడుము. ఇదిగో ఆ మొదటిఅద్దములో సూర్య బింబము కనబడుచున్నదా?

శ్వే॥ కనబడుచున్నది. అసలు సూర్యునివలెనే దిద్ది తీర్చినట్లున్నది.

ఉ॥ ఆ రెండవరంగు దానిలో.

శ్వే॥ పగిలిన నాల్గుముక్క లలోను నాలుగు బింబములు కన్పడుచున్నవి.

ఉ॥ బింబపు రేఖ ఎట్లున్నది.

శ్వే॥ కొంచెము మొద్దుబారియున్నది.

ఉ॥ ఆ తరువాత అద్దములో

శ్వే॥ అలికి వేసినట్లున్నది. ధూళిపట్టినదికాబోలు.

ఉ॥ ఆ తరువాతదానిలో

శ్వే॥ సూర్యబింబము ఎర్రగనున్నది.

ఉ॥ ఆ తరువాత అద్దపు పెంకులో

శ్వే॥ నీలముగ సూర్యుడున్నాడు.

ఉ॥ చూడుము. అన్ని అద్దములలోనికి చూడుము. అన్నిటిలోను బింబములు కన్పడుచున్నవా?

శ్వే॥ అన్ని బింబములు వేరు వేరుగ పూర్ణముగనున్నట్లే కన్పడుచున్నవి.

ఉ॥ గగనమువైపు చూడుము, అక్కడ ఎంతమంది సూర్యులున్నారు.

శ్వే॥ బాగు బాగు. ఒక్కడే ఉన్నాడు.

ఉ॥ ఒకేమారు ఈ ఇన్ని అద్దములలోను రకరకములుగ రంగులభేదముతో కన్పడుచున్నాడు. ఈరకములు ఈరంగులు ఏ వైనను ఆ సూర్యుడు, ఆ బింబము, ఆ తేజస్సు, ఆ రేఖ ఒక్కటే గదా!

శ్వే॥ చిత్తము

ఋ॥కు॥ అవును, అవును, మహర్షి శ్రేష్ఠా

ఉ॥ అదే విధముగ ఈభిన్న రూపములు, ఈ భిన్న నామములు, ఈ భిన్న క్రియలుగల ప్రపంచ వ్యష్టి సృష్టి యందు ఆ చిన్మాత్రసందశయే ఉండును. ఈ భిన్నములు దాని ఆభాసయే. అది మాత్రము ఏకము. అబాధితము, భిన్నములుగ కన్పించినది. ఈక్షించినపుడు దాని అభాస ప్రవేశించినది. అది భిన్న భిన్నములుగ కన్పించుచున్నది. అర్థమయినదా! ఈ పగలూ, ఈరాత్రియు ఇంతవరకు మననము చేసి కొనుడు. తిరిగి రేపు ఉదయము అనుష్ఠానానంతరము సందేహములను తీర్చుకొనవచ్చును.

(అందరు ఉద్దాలకునికి నమస్కరించుండిరి.)

అందరు నిష్క్రమణ. తెరదిగును.

# ఈ విశ్వమంతా నా గృహము

స్వామి ఓంకార్

## ఆత్మోయం శాంతిః

ఈ విశ్వమంతా నా విద్యాలయము అని రేడియోలో చక్కనైన పాట ఒక్కటి పిల్లల కార్యక్రమములో, బాలబాలికలను నేర్పుచుందురు. బావిలో కప్పలవలె, మా నూతిని మించినది లోకములోలేదు. సముద్రముగూడ మా నూతికంటె చిన్నదే అని కించజ్ఞత్వమైన భావనలతో ఒక జాతికి, మతమునకు, దేశమునకు బానిసలై, తమ జాతియే జాతులన్నింటిలో గొప్పదని, తమ మతమే మతములన్నిటిలో ఉత్కృష్టమైనదని, తమ దేశమును మించిన దేశము లేదని కూపస్థమండూకములవలె, వాదించుచు జీవించుచున్నవారిని జూచిన చింతగా నుండును.

ఈ విశ్వమంతా నా గృహమని పాడుటకు నా మనస్సు సదా కోరుచుండును. కోమలమైన బాల, బాలికల హృదయములలో చిన్నతనములోనె, విశ్వప్రేమ, విశ్వశాంతి, విశ్వమత బీజములను, నాటుచున్న వారి జీవితముల ధన్యవంతములు, ఎన్నటికైనను లోకశాంతి స్థిరము కావలెనన్న, యీ విశ్వభావనలే లోకకళ్యాణమునకు స్థిరమైన పునాదులై యుండవలెను. వ్యక్తుల శాంతియే దేశవృద్ధికి, మానవ కళ్యాణమునకు దారి జూపుచున్నదని, శ్రీ శాంత్యాశ్రమము ఏబది సంవత్సరముల నుండియు చాటుచున్నది.

**యద్భావం తద్భవతి**–నీ భావనలు యెటులయున్న అటులనే సర్వము జరుగుచుండునని పెద్దలు జెప్పెదరు. నీ గృహమే నీ సర్వముగా భావించుచు, అహంకార మమకారములతో నిండి అల్పమైన జీవితమును జీవించుచున్న, నీ గృహము దరికైనను యెవ్వరూరారు. లోకమే నీగృహముగా భావించుచు, విశ్వప్రేమతో జీవించుచున్నచో, అన్ని మతముల నుండియు, అన్ని దేశముల నుండియ, భక్తులు నీ గృహమునకు వచ్చెదరు. అటులనే శ్రీశాంత్యాశ్రమము లోకమంతకు, వివిధ దేశములలోయున్న వారందరకు శాంతి నిలయమై వెలుంగుచున్నదిగాన, భక్తులు అమెరికా, ఇంగ్లండు, ఫ్రాన్సు, జర్మనీ, డెన్‌మార్కు, రష్యా, మలయా, చైనా, ఆస్ట్రేలియా, కెనడా, జపాను, మొదలైన దేశముల నుండి గూడ వచ్చి ఆశ్రమములో శాంతిగా, గడుపుచు వృద్ధిచెందుదురు.

కెనడా సోదరి ఒక ఆమె వాల్తేరు ఆశ్రమములో శాంతిగా తన జీవితమును గడుపుచుండెను. ఈమధ్యను స్విడ్జర్లెండు నుండి, శాంతిదేవి అనే ఒక సోదరీమణి, భక్తురాలు ఆశ్రమమునకు వచ్చి యుండెను. ఆమె మరల ఒక సంవత్సరంలో తన దేశమునకు వెళ్ళి వచ్చెదననుచుండుటచే, ఆమె యిచ్చట వుండగా శాంతి ఆశ్రమ శాఖలలో కొంత కాలము శాంతిగా, శాంతిదేవి గడపవలెనని నిశ్చయించి నీలగిరి శాంతి నిలయము లక్ష్మీవిహార్‌కు వచ్చియుంటిమి. ఇచ్చటకు వచ్చుచుండ, ఈ మధ్యను

నాకు వచ్చిన హృదయజబ్బు, దైవకృపచే కుదిరినను, చాలమంది ఆశ్రమభక్తులు, డాక్టర్లుగూడ అంత యెత్తయిన తావునకు వెళ్లుట మంచిది గాదని, కొండలమీద యింతకాలము గడుపరాదని, శతపోరి జెప్పిరి. డాక్టర్లకు డాక్టరైన దైవము నా హృదయములో ప్రకాశించుచు, నన్ను నీలగిరివైపు పిలచుచున్నాడని జెప్పుచు, మొండిగా నీలగిరి ప్రయాణము స్థిరముజేసి వచ్చితిమి. అందరి మాటయు త్రోసివేసి వచ్చినందుకు దైవకృపవల్ల క్రింద వుండినప్పుడుకంటె, మీదకు వచ్చిన తర్వాతనే నా ఆరోగ్యము తృప్తిగా వున్నది. మనస్సు ఆనందముగా వున్నది. ఆత్మ శాంతిగాయున్నది.

## ఆత్మోయం శాంతిః

విశ్వమంతయు తన గృహముగా భావించుచు, విశ్వప్రేమతో జీవించుచున్న శాంతిదేవిని గురించి వ్రాయుటకు యీ వ్యాసము ప్రారంభించితిని. ఆమె వయస్సు 72 సంవత్సరములున్నను, ఆమె గురుకుల బాలికలతో ఎగురుచు, ఆడుచు ఆనందముగా నాట్యము జేయుచుండును. ఈ మధ్యనే ఆమె 72వ జన్మదినోత్సవము తోటపల్లిలో చేయబడెను. ఆ రోజున ఆమె బాలబాలికలను, ఆశ్రమవాసులను, ఆశ్రమ భక్తులు, అతిధులను యెన్నోరీతులుగా ఆదరించుచు, అందరికీ బహుమతులిచ్చుచూ, ప్రార్ధన, భజన, ధ్యానాదులతో ఉత్సాహముగా జరుపబడెను. నాకుగూడ నూరు రూపాయలు– ఆమె జన్మదినము జ్ఞాపకార్ధముగా బహుమతి యివ్వగా, నూతనముగా స్థాపింపబడిన మైత్రేయి ఆశ్రమంలో త్రవ్వబోయే నూతికి అర్పించితిని.

శాంతిదేవి దినచర్యలలో మనము నేర్చుకొనవలసినవి, మనము వృద్ధి అగుటకు, ఆశ్రమం వృద్ధియగుటకు యెన్నో పాఠములు గలవు. ఆమె ఉదయమేలేచి, ప్రార్థన ధ్యానాదులు, ఆధ్యాత్మిక మెఱుపులు, నిశ్శబ్ద గడియలలో మూడేసి అధ్యాయములు పారాయణజేసి, తర్వాత ఒక చిన్న తట్ట తీసుకొని బయలుదేరును. మొదటలో ఆ తట్ట ఎందుకొరకో, నాకును బోధపడలేదు. ఆమెను అనుసరించి పరీక్షించగా, ఆమె యెండి పోయిన పువ్వులు, ఆకులు, చెట్ల నుండి తీసి, ఆ తట్టలో వేసి, దూరముగా పారవేయుచుండును. బలవంతముగా మొక్కలను వంచి, అవి కదలిపోకుండగా ఒక్కొక్కసారి కత్తెరతో యెండిన కొమ్మలను కత్తిరించుచుండును.

కండ్లు వుండియు చూడరేల? అని ఏసుప్రభువు జెప్పిన మాటలు జ్ఞప్తికి వచ్చుచుండును. శాంత్యాశ్రమంలో 150 మంది పైగా బాలబాలికలు, పనివాండ్రు, సభ్యులు వున్నను ఇందులో ఒక్కరికైనా, యీ ఎండిపోయిన పువ్వులుగాని, ఆకులుగాని, ఏరిపారవేయవలెనని యెందుకు తోచలేదో ఎవ్వరికి వారే వారి జీవితములను పరీక్ష జేసుకొనవలెను. మనమంతా కండ్లు వుండియు అంధులముగా వుంటిమి. ఒక్కొక్కసారి స్వార్ధపు జీవితములో మొక్కలున్నట్లే కనిపించవు. కొందరు మాది పెద్దవయస్సు మేమెంతో చదువరులము. ధనికులము, మేము తోటపని జేయుదమా? అని తలంచుచుందురు. మరికొందరు అన్నియు వదలి, ఆశ్రమంలో జేరి తోటపని జేసేగతి మాకేల? అని తలచెదరు! శాంతిదేవి మాత్రము చిన్నవయస్సులో యున్నదా? 72 సంవత్సరములు గలిగియుండియు, అన్నియు వదలి ఆరువేల మైళ్ళు నుండి వచ్చిమొక్కల సేవ, ఆశ్రమసేవ జేయుటలేదా?

**పనిచేయని సోమరునికి తినుటకు హక్కులేదు.** అనెడి సూక్తిని, మన శాంతిదేవి, ఆశ్రమవాసులకేగాక, ఆంధ్రులకేగాక, తాను స్వయముగా **పనియే ఆరాధన** అన్నట్లు నిత్యము సేవజేయుచు, మన అందరకు లోకమంతకూ మార్గదర్శిగా వెలయుచున్నది.

దుర్లభమైన మానవజన్మ పొందినందుకు, దైవము నేత్ర దృష్టి యిచ్చినందుకు, దైవబిడ్డలమై యున్నందుకైనను, మనముగూడ, మానవ సేవయేగాక, పశుపక్ష్యాది జంతువులకు, వృక్షములకు, మొక్కలకుగూడ సేవజేయుచు మనము దినదినాభివృద్ధి గాంచుచు మానవకోటికి ఆదర్శనీయముగా, జీవించుట ముఖ్యము. యిప్పుడు నా మనస్సు ఆశ్రమవాసులందరకూ 150 చిన్న బుట్టలు కొని యివ్వవలెనని కోరుచున్నది. ఒక్కొక్కరు తీరికగా వున్నప్పుడే, 10, 15 నిముషములైనను, ప్రతీరోజును నియమముగా తోటపని జేయుచున్న మొక్కలు సౌందర్యముగా వుండి, ఆశ్రమవాసులకు, సందర్శకులకు ఆనందము నిచ్చుటయేగాక తోటపని వ్యాయామమవల్ల మనము ఆరోగ్యముగా గూడ యుందుము.

నీలగిరి శాంతి కేంద్రము ఎంతో శాంతిగా, ఏకాంతముగా పరవశత్వమునున గల్గించుచు, తనకు ఆరోగ్యమును దైవానుభవమును గల్గించుచున్నదని తన ఆనంద మునకు మేరయేలేదని, తన కొదువ జీవితము యీసారి మరల హిందూదేశము వచ్చినప్పుడు యిచ్చటనే గడుపుటకు నిశ్చయించితినని శాంతిదేవి తరుచు జెప్పుచుండ, నా మనస్సునకు, యిచ్చట యీ రమ్యమైన ఏకాంతమైన కొండలలో ఆశ్రమస్థాపన దైవకృపచే చేయగల్గినందుకు నేనుగూడ ఎంతయో తృప్తి పడుచుందును. యిచ్చట సర్వమత శాంతి ప్రార్థనాలయమునకు శ్రీమతి లలితాదేవి శంఖుస్థాపన జేసి, ఆరు సంవత్సరములు అగుచున్ననూ, యింకను పునాదులైనా కట్టించజాలనందుకు మనస్సు కొంత చింతగా యున్ననూ, యిప్పుడు శాంతిదేవి పేరున, దైవము యీ ప్రార్థనాలయము ప్రారంభించి త్వరలో ముగించుటకు నన్ను యిచ్చటకు తీసుకొని వచ్చెదరుగదాయని ఆనందించుచు, త్వరలో ప్రార్థనాలయం కట్టు ప్రారంభించుటకు ప్రయత్నించుచుంటిమి.

ప్రాక్ పశ్చిమ దేశములలోయున్న శాంతి, పీసు పాఠకులందరూ యీ విశ్వమత ప్రార్థనాలయము పూర్తి అగుటకు వారి వారి శక్తికొలది వుడతా భక్తితో ఏ తృణమైనను అర్పించి తోడ్పడుచు, యిచ్చట యీ విశ్వమత ప్రార్థనాలయము చాల ముఖ్యావసరము గాన, త్వరలో పూర్తి అగుటకు తోడ్పడెదరుగాక!

దైవపరితాపనతో నిండియున్న ఆశ్రమ భక్తులందరకూ స్వాగతము.
ఈ విశ్వమంతా నా గృహము.
ఈ విశ్వమంతా నా విద్యాలయము.
ఈ విశ్వమంతా నా దేవాలయమని మనమందరము యిప్పుడు గీర్తించుచూ, విశ్వప్రేమ, విశ్వశాంతి, విశ్వమతములో విలీనమయ్యెదముగాక!
లోకా సమస్తా స్సుఖినో భవంతు
ఓం శాంతి శ్శాంతి: శ్శాంతి:

(శాంతి అక్టోబరు 1964)

# భగవత్ కృప

**మూలం : శ్రీ అఖండానంద సరస్వతీ** **అనువాదం : టి. ఛాయాకృష్ణ**

## ఆత్మ సమర్పణతో విరాట్ స్వరూప దర్శనము

(గత సంచిక తరువాయి)

శ్రీ శుకదేవుడు పరీక్షితునితో ఇట్లనియె–రాజా! శుక్రాచార్యుని మాటలను విని బలి చక్రవర్తి ఒక్క క్షణం మౌనం వహించినాడు. కాని తర్వాత వినయ పూర్వకముగా ఇలా బదులు చెప్పసాగాడు. గురుదేవా–గృహస్థుల కొరకు సత్యా నృతములను కలిపి మీరు చెప్పినది కేవలం వ్యాపారం. సత్యాసత్యములు కలిస్తేనే వ్యాపారం జరిగేది. కేవలం నిజమే నిజము, అబద్ధమే అబద్ధము చెబితే వ్యాపారం జరుగదు. అలాగే జీవితంలో కూడా సత్యాసత్యముల మిశ్రమమున్నది. గృహస్థులకు, వైశ్యులకు దేనివలన వారికి తమ జీవిక, సంపద, భోగము, యశము వీటికి లోపము జరుగనటువంటి ధర్మమునే వారు పాటించాలి. ఇప్పుడు నేను బ్రాహ్మణులను ఎట్లు నిరాకరించగలను? ఒక సారి ప్రతిజ్ఞ చేసిన తర్వాత నేను ఎలా వెనక్కు తీసుకోగలను? అసత్యమును మించిన అధర్మము లేదు. నేను అన్నీ సహించగలను కానీ, అసత్య వాదిని సహించలేనని భూమాత అంటుంది. అప్పుడు నేను అసత్యమునెట్లు ఆశ్రయించగలను? నాకు నరకము, దు:ఖము వీటి భయం లేదు. స్థానభ్రష్టుడ నవుతానన్న భయం కూడ నాకు లేదు. నేను ఎట్టి పరిస్థితులలోనూ బ్రాహ్మణులను మోసం చేయలేను.సకల సంపదలు – వైభవము అన్నీ ఒకనాటికి నన్ను వదిలి పోయేవే. ఇవన్నీ ఒక బ్రాహ్మణుని సంతోషపరచుటకు పనికిరాక పోతే ఇక వీటితో పని ఏమున్నది? దధీచి, శిబి వీరంతా తమ ప్రాణాలను అర్పించి ఇతరులకు మేలు చేశారు. కానీ నేను మాత్రం ఈ బ్రాహ్మణునికి ఒకసారి ఇస్తానని చెప్పి ఇప్పుడు నా రాజ్యము కొరకు నేనెట్లు వద్దనగలను? ఈ భూమి మన తాత – ముత్తాల వద్ద కూడ వుండినదే, కానీ వారంతా మరణించారు. ఈ భూమి మాత్రం ఎక్కడున్నది అక్కడే వున్నది. కేవలం మన పూర్వజుల కీర్తియే ఇప్పటి వరకు మిగిలి వున్నది. ఎలాగైతే యుద్ధభూమిలో వీరులు ధర్మము కొరకు తమ ప్రాణ త్యాగము చేస్తారో అట్లే సత్పాత్రుడు లభించినప్పుడు ధనమును కూడ త్యాగము చేయాలి. ఒకవేళ దయాళువైన పురుషుడు దానము చేయడములో దీనతను చూపిస్తే ఇక దానము యొక్క మహిమ ఎక్కడ వుంటుంది? గురుదేవా! విష్ణు భగవానుడే వామనునిలాగ వచ్చాడని మీరు అంటున్నారు. అప్పుడు అది ఇంకా ఇంకా మంచిది. దీనివలన విజయం మనదే అవుతుంది. పరోక్ష రూపములోనున్న ఏ విష్ణువుకై దాన ధర్మములను చేస్తారో, అతడే మన ఎదుటకి వచ్చి మనతో దానం తీసుకొనుటకు వచ్చాడు. ఇంతకంటే మంచి మాట మరి ఏమున్నది? ఒకవేళ అతడు నన్ను బంధించాలనుకుంటే కూడ నాకేమీ భయం లేదు. ఎందుకనగా అతడు బలవంతుడయితే చక్రమును తీసుకుని నన్ను చంపి భూమిని తీసుకుని ఇంద్రునికి ఇచ్చి వుండేవాడు. కానీ ఇతడేమో నాతో ఓడి ఇలా వేషము మార్చుకుని వచ్చాడు. ఇతడు రావడముతోనే మాకు విజయం కలిగినది. ఒకవేళ అతడు నన్ను బంధింపచూచినా కూడ నేను అతని పై ప్రహారము చేయను. ఎందుకనగా అతను బ్రాహ్మణ రూపంలో నా వద్దకు వచ్చాడు. ఒకవేళ ఇతడు మనపై శస్త్రప్రయోగము చేసినా కూడ, మనము శస్త్రములను ప్రయోగించము, ఇతనితో ఓడిపోవడంలోనే మన విజయమున్నది. మన కీర్తి కూడ నశించదు. ఇతడు నా నుండి పృథ్వినంతటినీ తీసుకున్నా తీసుకోనీ.

గురువులందరూ కూడ తమ శిష్యులు తమ మాట వినాలనే అనుకుంటారు. అందుకని బలి తన మాట వినకపోయేటప్పటికి శుక్రాచార్యునికి క్రోధము వచ్చి ఇలా అన్నాడు – మూర్ఖుడా! అజ్ఞానివి నీవు. కానీ అహంకారంతో ధర్మజ్ఞానిననుకుంటున్నావు. నీవు నా

ఆజ్ఞనుల్లంఘించినావు. అందువలన వెంటనే నీవు నీ ఐశ్వర్యము పోగొట్టుకుంటావు. కానీ ఈ విధముగా గురువు శాపమిచ్చినా కూడ బలి విచలితుడు కాలేదు. అతడు తన ప్రతిజ్ఞ ప్రకారము వామనునికి దానమొసగుటకు సంకల్పము చేయనుద్యుక్తుడైనాడు. బలియొక్క పత్ని అతని ధర్మపాలనలో అతనికి సహాయము చేసినది. పతి ఏదేని ధర్మకార్యము ఆచరిస్తూ వుంటే సహాయము చేయడమే పత్ని యొక్క ధర్మము అందులో అడ్డు చెప్పరాదు.

వామనుని చరణారవిందములను ప్రక్షాళనము చేసి బలి సంకల్పము చేయుటకు ప్రయత్నించగా జలపాత్ర నుండి నీరు బయటికి రాలేదు. ఈ కథ భాగవతములో లేదు, కానీ నృసింహ, వామనపురాణములలోనున్నది. వాటి ప్రకారము వామనుడు జలమును తీసుకోగా ఆ జలపాత్ర యొక్క కొండీలో శుక్రాచార్యుడు దూరిపోయి జలము రాకుండా చేశాడు. ప్రతి పురోహితునికి తమ యజమాని సంపన్నుడై వుంటే మనకు ఎప్పటికీ దాన దక్షిణలు లభిస్తాయని అనుకుంటారు కదా! అతడే నిరుపేద అయితే ఇక దానధర్మములెలా జరుగుతాయి. ఇక మనకెలా దాన దక్షిణలు ముడతాయి? అనుకుని శుక్రచార్యుడు ఆ కలశపు కొండీలో ప్రవేశించాడు. వామనుడన్నాడు ఎందుకని నీరు రావడం లేదు? ఆ పాత్ర నాకివ్వండి అని ఒక కుశ తీసుకుని దానిలోకి గుచ్చాడు. శుక్రాచార్చుడుకి ఒక కన్ను పోయినది. ఒంటి కన్ను వాడయినాడు. అతనికీ దీనివలన కీర్తియే కలిగినది. బలియొక్క సంకల్పము పూర్తి కాగానే నలుదెసల నుండి పూల వర్షము కురిసినది. గంధర్వులు గానం చేయసాగారు. అదే సమయములో వామనుడు పెరిగి విరాట్ అయినాడు.

త్రివిక్రముడయినాడు. మనిషి తన దాన సంకల్పము చేసేటంతవరకు భగవంతుడు తన విరాట్ స్వరూపమును ప్రకటించడు, చిన్నగానే వుంటాడు. కానీ అన్నీ ఆత్మ సమర్పణము చేసి సంకల్పము చేసుకొనగానే భగవంతుడు విరాట్ స్వరూపము చూపిస్తాడు. ఋగ్వేదములో ఈ విషయములో పదునైదు, పదహారు మంత్రములున్నవి.

భగవంతుడు విరాట్ రూపమును తీసుకోగానే సకలలోకములు త్రివిక్రముడి లోకి వచ్చాయి. బలి ఆ అద్భుత రూపమును దర్శించినాడు. పృథ్వి, ఆకాశము, స్వర్గము, దిక్కులు, పాతాళము, సముద్రము మొదలైనవన్నీ భగవంతుడిలోనే వున్నాయి. భగవద్గీతలో విరాట్ పురుషుని ఎట్లు వర్ణించారో అట్లే ఇక్కడ కూడ వర్ణన చేశారు. పిక్కలలో పర్వతములు, మోకాళ్ళలో పక్షులు, తొడలలో మరుద్గణములు - బలి దర్శించినాడు. ఆ విరాట్ పురుషుని వక్షస్థలం (హృదయం) లో ధర్మము, స్తనములలో, ఎన్ని ఇంద్రియములున్నవో, ఎన్ని విషయములున్నవో, ఎంతమంది కర్తలున్నారో ఆసమస్తము విరాట్ భగవానుని శరీరములోనే అగుపించాయి. ఇదంతా చూచి దైత్యులు చాల భయభ్రాంతులు, దు:ఖితులు అయిరి. ఇంతలో భగవంతుని చేతికి అతని ఆయుధములు కూడ వచ్చాయి. ఆ సమయంలో భగవంతుడు చాల శోభాయమానుడై వున్నాడు. చివరకు శ్రీ శుకదేవుడు ఇలా అంటున్నాడు-

పరీక్షిత్! త్రివిక్రములు ఒక పాదముతో సంపూర్ణ భూమిని కొలిచి వేశాడు. శరీరముతో ఆకాశమును బాహువులతో దిక్కులను కొలిచి వేశాడు. మూడవ పాదము కొరకు ఇక ఏదీ మిగలలేదు. ఈ రెండే లోక పరలోకములు, ధర్మము యొక్క స్థానములు. బలి చాల గొప్ప ధర్మాత్ముడు. అతనికి లోకములోను సుఖము, పరలోకములోను సుఖము వున్నది. అందువలన త్రివిక్రముడు రెంటిని కొలిచి వేశాడు. అతని నుండి లోక-పరలోకములను రెంటిని తీసుకున్నాడు. ఇక మూడవ పాదము ఎక్కడ పెట్టాలి?

**తయా వ్యాససమాసిన్యా ప్రీయతాం పురుషోత్తమ: ॥ 16**
**ఆరిరాధయిషు: కృష్ణం వాచం జిగదిషామి యామ్ ।**

భీష్ముడు ఇలా ప్రారంభించాడు.

కృష్ణుని ఆరాధించాలని నేను విస్తారమూ, సంక్షేపమూ అయిన వాక్కులతో స్తుతిస్తున్నాను. దానితో పురుషోత్తముడు ప్రీతి నొందుగాక.

**శుచిం శుచిపదం హంసం తత్పదం పరమేష్ఠినమ్ ॥ 17**
**ముక్త్వా సర్వాత్మనా22త్మానం తం ప్రపద్యే ప్రజాపతిమ్ ।**

శుచి, శుచిపదుడు, హంసుడు, తత్ అనే పరంచేత చెప్పబడేవాడు, పరమేష్ఠి అయిన ప్రజాపతిని, సర్వాత్మనా ఆత్మను (మూడు దేహాలను) విడిచిపెట్టి శరణు వేడుతున్నాను.

**అనాద్యంతం పరం బ్రహ్మ న దేవా నర్షయో విదు: ॥ 18**
**ఏకో యం వేద భగవాన్ ధాతా నారాయణో హరి: ।**

ఆయనకు ఆది–అంతమూ లేవు. పరబ్రహ్మ అతడే. దేవతలూ, ఋషులూ కూడా ఆయనను తెలుకోలేరు. సృష్టికర్త నారాయణుడు అయిన హరి ఒక్కడే ఎరుగును.

**నారాయణాదృషిగణా: తథా సిద్ధమహోరగా: ॥ 19**
**దేవా దేవర్షయశ్చైవ యం విదు: పరమవ్యయమ్ ।**

నారాయణుని వల్ల ఋషిగణాలు, సిద్ధులూ, మహానాగులూ, దేవతలు, దేవర్షులూ ఆయనను అవ్యయమయిన పరతత్త్వమని తెలుసుకొన్నారు.

**దేవదానవగంధర్వా: యక్షరాక్షసపన్నగా: ॥ 20**
**యం న జానంతి కో హ్యేష: కుతో వా భగవానితి ।**

ఈతడెవరు? ఈ భగవానుడు ఎక్కడివాడు? అనే విషయాలు దేవ దానవులు కాని, గంధర్వులు కాని, యక్షరాక్షస పన్నగులు కాని తెలుసుకోలేరు.

**యస్మిన్విశ్వాని భూతాని తిష్ఠంతి చ విశంతి చ ॥ 21**
**గుణభూతాని భూతేశే సూత్రే మణిగణా ఇవ ।**

భూతాలన్నీ ఇతనిలోనే ఉన్నాయి. ఇతనిలోనికే చేరుకొంటాయి. భూతేశుడైన భగవంతునిలో ఇవి అప్రధానాలై సూత్రంలో మణులగణాలవలె ఉన్నాయి.

**యస్మిన్నిత్యే తతే తంతౌ దృఢే స్రగివ తిష్ఠతి ॥ 22**
**సదసద్గ్రథితం విశ్వం విశ్వాంగే విశ్వకర్మణి ।**

విశ్వమంతా శరీరమయిన వాడు అతడు. విశ్వమే అతని చేష్టలు. అతడు నిత్యుడు. ఈ విశ్వం దారంలో దండవలె అతనిలో నిలిచి ఉంది.

**హరిం సహస్రశిరసం సహస్రచరణేక్షణమ్ ॥ 23**
**సహస్రబాహుముకుటం సహస్రవదనోజ్జ్వలమ్ ।**

అతనికి ఎన్నో తలలు, పాదాలు, కళ్లూ, చేతులూ, కిరీటాలూ, ముఖాలూ ఉన్నాయి.

**ప్రాహుర్నారాయణం దేవం యం విశ్వస్య పరాయణమ్ ॥24**
**అణీయసామణీయాంసం స్థవిష్ఠం చ స్థవీయసామ్ ।**
**గరీయసాం గరిష్ఠం చ శ్రేష్ఠం చ శ్రేయసామపి ॥ 25**

విశ్వానికి పరాయణంగా ఆ హరిని, నారాయణుని ప్రశంసిస్తారు. అతడు అణువులలో మరింత అణువు. పెద్దవాటిలో పెద్దవాడు. బరువైన వానిలో బాగా బరువైనవాడు. మేలయినవానిలో మేలయినవాడు అని ప్రశంసిస్తారు.

**యం వాకేష్వనువాకేషు నిషత్సూపనిషత్సు చ ।**
**గృణంతి సత్యకర్మాణం సత్యం సత్యేషు సామసు ॥ 26**

అతనిని మంత్ర. బ్రాహ్మణాల్లోనూ, దేవతా జ్ఞానం కలిగించే వేద వాక్యాలలోనూ, ఉపనిషత్తులలోనూ, సత్యాలయిన సామల్లోను నిర్దోషునిగా, సత్యకర్మునిగా ధ్యానిస్తారు.

వి॥సం॥ వాకేషు= మంత్రవాక్యాల్లో యజ్ఞాదికర్మలను చెప్పేవానిలో.

అనువాకేషు= మంత్రాల అర్థాన్ని వివరించే బ్రాహ్మణాల్లో.

సత్యేషు= దోషం లేని వానిలో–జ్యేష్ఠసామము మొ॥ వానిలో. (నీల)

**చతుర్భిశ్చతురాత్మానం సత్త్వస్థం సాత్వతాం పతిమ్ ।**
**యం దివ్యైర్దేవమర్చంతి గుహ్యైః పరమనామభిః ॥ 27**

నాలుగు రూపాలయిన ఆత్మకలవాడతడు. బుద్ధిలోనే తెలుస్తాడు. భక్తపాలకుడు. అటువంటి దేవుని శ్రేష్ఠాలయిన నాలుగు గూఢ నామాలతో అర్చిస్తారు.

వి॥సం॥ చతురాత్మానమ్=నాలుగురూపాలు కల ఆత్మను.

1. బ్రహ్మము 2. జీవుడు 3. మనస్సు 4. అహంకారం అనేవి రూపాలు. సత్త్వస్థమ్ =బుద్ధిలో తెలిసేవానిని. చతుర్భిః నామభిః = వాసుదేవుడు, సంకర్షణుడు, ప్రద్యుమ్నుడు, అనిరుద్ధుడు అనే నామములతో. (నీల)

**యస్మిన్నిత్యం తపస్తప్తం యదంగేష్వనుతిష్ఠతి ।**
**సర్వాత్మా సర్వవిత్సర్వః సర్వజ్ఞః సర్వభావనః ॥ 28**

తపస్సులన్నీ నిత్యమూ అతనికోసమే చేయబడుతున్నాయి. ఆ తపస్సు ఉండడం వల్లనే మన శరీరాల్లో అతడు నిలిచి ఉంటాడు. అతడు సర్వాత్ముడు, సకలమూ తెలిసిన వాడు. సర్వాన్నీ భావించేవాడు. అతనిని ఆరాధిస్తున్నాను. (28)

వి॥సం॥ నిత్యమయిన తస్సు– పరమేశ్వర ప్రీతి కోసం చేసే తపస్సు మన హృదయాల్లోనే ఉండి చిత్తాన్ని శుద్ధి చేస్తుంది. 'చిత్తస్య శుద్ధయే కర్మ.' (నీల)

**యం దేవం దేవకీదేవీ వసుదేవాదజీజనత్ ।**
**భౌమస్య బ్రహ్మణో గుప్త్యై దీప్తమగ్నిమివారణిః ॥ 29**

వసుదేవుని వలన దేవకీదేవి అతనిని కన్నది. వేద, బ్రాహ్మణ, యజ్ఞాలను రక్షించటానికి, ప్రజ్వలించే అగ్నిని అరణి కన్నట్లుగా దేవకి కన్నది. (29)

వి॥సం॥ భౌమస్య బ్రహ్మణః=భూమి సంబంధమైన బ్రాహ్మము యొక్క అనగా వేదాలు, బ్రాహ్మణులు, యజ్ఞాలు. (నీల)

**యమనన్యో వ్యపేతాశీః ఆత్మానం వీతకల్మషమ్ ।**
**దృష్ట్వానంత్యాయ గోవిందం పశ్యత్యాత్మానమాత్మని ॥ 30**
**అతివాయ్వింద్రకర్మాణమ్ అతిసూర్యాతితేజసమ్ ।**
**అతిబుద్ధీంద్రియాత్మానం తం ప్రపద్యే ప్రజాపతిమ్ ॥ 31**

అన్యభావన లేకుండా, కోరికలు విడిచిన సాధకుడు కల్మష స్పర్శలేని గోవిందుని సూక్ష్మ దృష్టితో మోక్షంకోసం ఆత్మలోనే దర్శిస్తాడు. వాయువును, ఇంద్రుని మించిన శక్తి కలిగి, సూర్యుని మించినతేజస్సు కలిగి, బుద్ధికీ, ఇంద్రియాలకూ, దేహానికీ మించిన స్థితీ కల ప్రజాపతిని శరణు వేడుతున్నాము. (30,31)

**పురాణే పురుషం ప్రోక్తం బ్రహ్మ ప్రోక్తం యుగాదిషు ।**
**క్షయే సంకర్షణం ప్రోక్తం తముపాస్యముపాస్మహే ॥ 32**

పురాణాల్లో పురుషుడనీ, యుగారంభంలో బ్రహ్మమనీ, యుగాంతంలో సంకర్షణుడనీ పిలువబడే ఉపాస్యదైవాన్ని ఉపాసిస్తున్నాము. (32)

**యమేకం బహుధా22త్మానం ప్రాదూర్భూతమధోక్షజమ్ ।**
**నాన్యభక్తాః క్రియావంతః యజంతే సర్వకామదమ్ ॥ 33**
**యమాహుర్జగతః కోశం యస్మిన్సన్నిహితాః ప్రజాః ।**
**యస్మిన్‌లోకాః స్ఫురంతీమే జలే శకునయో యథా ॥ 34**

**ఋతమేకాక్షరం బ్రహ్మ యత్తత్సదసతో: పరమ్ ।**
**అనాదిమధ్యపర్యంతం స దేవా నర్షయో విదు: ॥ 35**
**యం సురాసురగంధర్వా: సిద్ధా: ఋషిమహోరగా: ।**
**ప్రయతా నిత్యమర్చంతి పరమం దు:ఖభేషజమ్ ॥ 36**
**అనాదినిధనం దేవమ్ ఆత్మయోనిం సనాతనమ్ ।**
**అప్రేక్ష్యమనభిజ్ఞేయం హరిం నారాయణం ప్రభుమ్ ॥ 37**

ఒకడే అయినా ఎన్నో రూపాలతో ఉద్భవించేవాడు. అధోక్షజుడు, అన్నికోరికలూ తీర్చేవాడు అని క్రియాపరులు అనన్య భక్తితో పూజిస్తారు. అతడు లోకానికి ధనాగారం, అతనిలోనే ప్రజలంతా ఉన్నారు. నీటిలో పక్షులవలె అతనిలో లోకాలన్నీ కదులుతూ ఉంటాయి. సత్యస్వరూపుడు. ప్రణవ స్వరూపుడు (ఓమ్). సత్తుకు, అసత్తుకూ పరమైనవాడు. ఆది మధ్యాంతాలు లేనివాడు. అతనిని దేవతలూ ఋషులూకూడా ఎరుగరు. ఆయనను దేవతలూ, రాక్షసులూ, గంధర్వులూ, సిద్ధులూ, ఋషులూ, ఉరగులూ నిత్యమూ దు:ఖమనే రోగానికి మందు వంటివాడని శ్రద్ధతో పూజిస్తారు. ఆది మధ్యాంతాలు లేనినవాడు. స్వయంభువు, సనాతనుడు. ఎవరూ ఆయనను చూడలేరు. తెలుసుకోలేరు. హరి, నారాయణుడు, ప్రభువు. (33-37)

**యం వై విశ్వస్య కర్తారం జగతస్తస్థుషాం పతిమ్ ।**
**వదంతి జగతో2ధ్యక్షమ్ అక్షరం పరమం పదమ్ ॥ 38**

విశ్వానికి కర్త, నడిచే దానికీ, నిలిచిన దానికీ రక్షకుడు జగత్తుకు అధ్యక్షుడు, అక్షరుడు, పరమపదం అని ఆయనను చెపుతారు. (38)

**హిరణ్యవర్ణం యం గర్భమదితేర్దైత్యనాశనమ్ ।**
**ఏకం ద్వాదశధా జజ్ఞే తస్మై సూర్యాత్మనే నమ: ॥ 39**

బంగారు వన్నెతో అదితిగర్భంనుండి దైత్యనాశకుడై పన్నెండు రూపాలతో పుట్టిన సూర్యాత్మునకు నమస్కారం. (39)

**శుక్లేదేవాన్పితౄన్కృష్ణే తర్పమత్యమృతేన య: ।**
**యశ్చ రాజా ద్విజాతీవాం తస్మై సోమాత్మనే నమ: ॥ 40**

శుక్లపక్షంలో దేవతలనూ, కృష్ణపక్షంలో పితృదేవతలనూ తృప్తిపరుస్తూ ద్విజులకు రాజయిన చంద్రాత్మునకు నమస్కారం. (40)

**(హుతాశననముఖైర్దేవై: ధార్యతే సకలం జగత్ ।**
**హవి: ప్రథమభోక్తా య: తస్మై హోత్రాత్మనే నమ:) ॥**

(అగ్నిముఖులయిన దేవతలచే జగత్తంతా ధరింపబడుతోంది. అగ్నిలో వ్రేల్వబడిన హవిస్సుకు మొదటి భోక్త అయిన అగ్నిహోత్ర రూపునకు నమస్కారం).

# శ్రీ తులసీ సర్వస్వము

జి.వి.యస్. సుబ్రహ్మణ్య శాస్త్రి

## ఐ. తులసిని కోయకూడని సమయములు (నిషిద్ధసమయములు)

ఆదివారము అమావాస్య, ద్వాదశి సంక్రాంతిదినములలో తులసిని కోయరాదు. మరి పైన పేర్కొనిన రోజులలో కూడ పూజకు తులసీదళములు కావలెను కదా! అందువలన వాటిని అంతకు ముందురోజుననే కోసి ఉంచుకొనవలెను. జీవితమును నశింపచేసికొన దలచినచో పైన చెప్పిన రోజులలో తులసిని కోయ వచ్చును.

గ్రహణసమయములలోను అర్ధరాత్రి తరువాత మూడు గంటలవరకును తులసీదళములను కోయకూడదు. నిషిద్ధదినములలో తులసిని కోయుట మరణమునకు దారితీయును అను బెదిరింపు ఇందు సూచింపబడినది.

**శ్లో॥ ద్వాదశ్యాం తులసీపత్రం,ధాత్రీపత్రంచ కార్తికే। లునాతి స నరో గచ్ఛే న్నిరయా నతిగర్హి తాన్॥**
**దేవార్థే తులసీచ్ఛేదో, హెూమార్థే సమిధ స్తథా। ఇందుక్షయే న కుర్వీత గవార్థే తు తృణాని చ॥**

(పద్మపురాణము)

ద్వాదశినాడు తులసీదళమును, కార్తీకమాసమునందు ధాత్రీ (ఉసిరి పత్రమును) కోసిన నరుడు, అతిగర్హితములైన (భయంకరములైన) నరకస్థానములకు తప్పకపోవును.

దేవతల పూజలకొరకై తులసిని కోయుట, హోమముకొఱకై సమిధలను కోయుట గోవులకొఱకై గడ్డిని కోయుట, మొదలగు పనులను ఇందుక్షయకాలమ నందు (చంద్రుడు క్షీణించిఉండు అమావాస్య దినమునాడు) చేయరాదు. తులసి దళమును ఎప్పుడు కోయరాదో దాని పవిత్రత ఏమో దాని ఫలిత మెంతటిదో ఈక్రింది శ్లోకములలో నిరూపింపబడినది.

**శ్లో॥ పూర్ణిమాయా మమాయాంచ ద్వాదశ్యాం రవిసంక్రమే। తైలాభ్యంగం చ కృ త్వాచ మధ్యాహ్నే నిశి సంధ్యయో॥**
**అశౌచే2 శుచికాలే చ రాత్రి వాసో2 న్వితా నరా। తులసిం యే విచిన్వంతి తే చింధంతి హరే: శిర: ॥**

తా॥ పూర్ణిమ, అమావాస్య, ద్వాదశి, సూర్యసంక్రమణము మొదలగు పర్వదినముల యందును, మరియు తలంటి పోసుకొనుటకై నూనెరాసికొని ఉన్నప్పుడును, మధ్యాహ్నం, రాత్రి, సంధ్య మొదలగు ప్రత్యేకసమయముల యందును, మైల, అశుచి మొదలగు అపవిత్రసమయములయందును, తులసిని కోసినచో వానికి విష్ణువుయొక్క తలను నరికినంతటి పాపఫలము వచ్చును.

**శ్లో॥ న ఛింద్యాత్ తులసీం విప్రా: ద్వాదశ్యాం వైష్ణవా క్వచిత్।**

(విష్ణుధర్మోత్తరపురాణము)

తా॥ బ్రాహ్మణుడైన వైష్ణవుడు ఎవరైనను, ఎచ్చటనైనను ద్వాదశి తిథినాడు తులసిని కోయరాదు.

**శ్లో॥ భానువారం వినా దూర్వాం తులసీం ద్వాదశీం వినా।**
**జీవితస్య వినాశాయ న విచిన్వీత ధర్మవిత్** (గరుడపురాణము)

తా॥ దూర్వాను (గరికపోచలను) ఆదివారము కాకుండా తక్కిన రోజులయందును, ద్వాదశితిథినాడు కాకుండా తక్కిన రోజులలో తులసిని కోయవలెను. జీవితమును నశింపచేసికొనదలచిన, ధర్మవేత్త, పైన పేర్కొనిన దళములను పైన పేర్కొనబడిన రోజులలో కోయవచ్చును. కలకాలము జీవింపదలచినవాడు గరికను ఆదివారము నాడును, తులసిని ద్వాదశి తిథినాడును కోయరాదని గరుడపురాణము పేర్కొన్నది. శ్రీ విష్ణుభక్తు డయినవాడు ద్వాదశి తిథి నాడు తులసిని కోయరాదని విష్ణుధర్మోత్తర పురాణము పేర్కొనినది.

# లాడుబావా చరిత్రము

## శత్రువులోను భగవద్దర్శనము చేసిన స్థితప్రజ్ఞుడు

ధనవంతమైన, అందమైన జ్యోతిపురము అనుప్రసిద్ధి చెందిన పట్టణమున హరిభక్తికలవాడును. విరక్తుడును అగు లాడుబావా అను భక్తుడండెను. అతడు తీర్ధయాత్రలలో హిమాలయములలోని విష్ణుపదము నందుకల గంగోత్రి యందు స్నానముచేసి బ్రహ్మకపాలము, బదరీనారాయణము, హరిద్వారము, సాలగ్రామము, నైమిశారణ్యములను చూసెను. గయలోని ఫల్గుణీనదిలో స్నానము చేసి విష్ణుపాదమును దర్శించెను. వైద్యేశ్వరము, జగన్నాధము. శ్రీ కూర్మము, భీమేశ్వరము, సింహాచలము, శ్రీశైలము, విరూపాక్షము, అహోబిలములను దర్శించెను. వేంకటాచలమునకు పోయి స్వామి సేవలో కొన్ని రోజులుండి కాళహస్తి, ఘటికాచలము, కాంచీ పురము, వేదగిరి, శ్రీముష్ణము కుంభకోణము మొదలగు పుణ్య ప్రదేశములలో భగవదర్శనము చేసుకొనెను. శ్రీరంగక్షేత్రమున రంగనాధుని సేవలో ఒక సంవత్సరముండి తరువాత హాలాస్యము తోతాద్రి, దర్భశయనము అనంత పద్మనాభము. జనార్ధనము, గోకర్ణము యాదవాద్రి మొదలగు తీర్థప్రదేశములను దర్శించి అచటనున్న భగవద్భక్తులతో కూడి భగవద్గుణగానము చేసి ఆనందముతో బయలుదేరెను. మార్గమధ్యములో కావూరను నగరములో ఒకతోటలో ఆగి నిత్యకర్మానుష్ఠానములను చేసుకొని ధ్యానములో నుండెను. ఆపురప్రజలు క్రూరులు, అసత్యవర్తనులు, జీవహింసా దురంధరులు, దయలేనివారు, మహాశక్తిని ఆరాధించి నరబలిని యిచ్చువారు. లాడుబావాకు యీ విషయము లేవియు తెలియక ఆవూరిలో మజలీ చేసెను.

ఆ రోజున నరబలికి ఎవరూ దొరకనందున నలుగురు రాజభటులు లాడుబావాను చూచి సంతోషించి అతనిని పట్టి, కట్టి తీసుకొని పోయి మహాశక్తి ఎదుట నిలిపి ముగ్గురు కదలకుండా పట్టుకొనగా నాలుగవ వాడు నరకుటకు సమీపించెను. అపుడు సదా మనస్సునందు శ్రీకృష్ణుని స్మరించు లాడుబావా ఇది నా పూర్వజన్మ ఫలము నా ప్రార్ధన విని నన్ను అనుగ్రహించుము. కష్టములో వున్నవారు, దు:ఖముతో వున్నవారు, శారీరకముగా మానసికముగా చితికి పోయినవారు భయపడిన వారు ఘోరమైన వ్యాధులచే పీడింపబడువారు నారాయణుని పేరును తలచినంత మాత్రముననే వారు వారివారి దుఃఖముల నుండి విముక్తులై సుఖమునందెదరు. నీ సేవకుల సేవకులకు పరిచారకుల సేవకుల సేవకులకు సేవకులకు సేవకుడనైన నేను లోకేశ్వరా నిన్ను స్మరిస్తున్నాను. అని అనేక విధముల అనంతుని ప్రార్ధించెను. ఆ సమయమున రక్షించినను శిక్షించినను హరిస్మరణ తప్ప వేరొక వుపాయము లేదని దైవనామస్మరణ చేయుచు దృఢచిత్తముతో నుండెను.

అపుడు కాళికాదేవి ఉగ్రరూపముతో దేవాలయము నుండి వెలుపలికి వచ్చి ఆనలుగురిని చంపి శాంతించెను. లాడుబావా పాదములకు నమస్కరించి శ్రీహరి దాసుడైన అతనికి తన వలన కలిగిన అపరాధమునకు క్షమించి రక్షించవలసినదిగా ప్రార్ధించి

వరము కోరుకోమనెను. నాకు ఏవరము అవసరము లేక పోయినను, నీవు వరమునిచ్చెదనని అంటివి కావున యీ వరమును యిమ్ము. నీవు ఇన్నాళ్ళు జీవహింసకు లోబడి వుంటివి నీకు బలులిచ్చుటకుచేయు జీవహింసతో ఈ దేశప్రజలందరూ మహాపాపులైరి ఇక ముందు వీరిని శ్రీహరి దాసులై హరిభజన చేయునట్లు చేయుమని లాడుబావా కోరెను. ఆ రాత్రి కాళికాదేవి ఆదేశరాజునకు స్వప్నము నందు కనపడి నేడు మొదలు యీదేశప్రజలందరు జీవహింస మానునట్లు ఆదేశింపుము. నా ఆలయములో నున్న హరిదాసునకు శిష్యుడ వగుము అట్ల చేయని యెడల నిన్ను నీ కుటుంబమును, నీ ప్రజలను నాశనము చేసెదనని  అదృశ్యురాలయ్యెను.

రాజులేచి, మంత్రిని పిలిపించి జీవహింస నిషేధించమని, కాళికాలయమున నున్న హరిభక్తుని అనుగ్రహమును పొందవలెనని చాటింపు వేయించుమనెను. ఆరాజు కాళికాల యమునకుపోయి అచ్చట చచ్చిపడి యున్న నలుగురి భటులను చూచి ఆశ్చర్యపడి లాడుబావా సాష్టాంగనమస్కారము చేసి, అనేక విధముల పొగడి, చేతులు కట్టుకొని నిలబడెను లాడుబావా, “రాజానీకేల యిట్టి దుర్బుద్ధి కలిగినది? జీవహింస వలన కొంచెమైనను సుఖము లేదు అన్నీ కదలు కదలని శరీరములను తన శరీరముగా నున్న లక్ష్మీపతి దివ్య రూపమును తెలియకపోతివి. సర్వము పురుషోత్తముడే అని తలచవైతివి. భార్యాపుత్రులు, బంధువులు, ధనము శాశ్వతములు కావు. నీ ఆత్మరక్షణ వుపాయమును తెలుసుకొనుము. ఈ శరీరము నీటి బుడగ వంటిది. ఈ శరీరము విడిచిన తరువాత మనము చేసిన పాపములకు తగినట్టి నరకము యమునిచే యివ్వబడును. ఇకనైన పునర్జన్మ లేని నిత్యసంతోషమును పొందుమ. సాధుసాంగత్యము చేయుము. సాధుసాంగత్యముచే పుత్ర దారగృహక్షేత్రాదుల మోహము నుండి విముక్తుడవగుదువు. నేను నాది యను మోహమును మానిన తత్వజ్ఞానము కలుగును. దాని వలన మోక్షము కలుగును” అని హితోపదేశము చేసెను. రాజు మంచి బుద్ధిని పొందిన వాడైనను లాడుబావా యొక్క దృఢమైన గట్టి సాధనా ప్రయత్నమును కనుగొనవలెనని తలచెను. నీవు చులకనగా నన్నొక గడ్డిపోచ వలె తలచితివి. శాంతి శమదమాదులు లేనివారు భక్తులనదగరు. నీభక్తిని నిమిషములో చూచెదనని చెప్పి తన భటులతో లాడుబావాను ఒక పాడు నూతిలో పడత్రోసి పైన ఒక పెద్ద బండచే మూయించెను.

లాడుబావా నూతి క్రింద భాగమున మొలచిన గడ్డిపై హంసతూలికా తల్పము పైన కూర్చుండి నట్లు కూర్చుని హరిధ్యానము చేయుచు వాసుదేవుని దివ్యమంగళ విగ్రహము పూజను మనసులో అనుభవించు చుండెను. తేనెటీగలు అతనికి కావలసినంత తేనెను అందించు చుండెను. అతడు దానిచే ఆకలిని తీర్చుకొని శ్రీహరి ధ్యానములో పరమానంద భరితుడై యుండెను. రాజు లాడుబావా మహిమకు ఆశ్చర్యపడి భయపడి అతనిని బయటకు తీయమని భటులను ఆజ్ఞాపించెను కాని నూతిపై మూసిన రాయి మనుష్యులే కాదు ఏనుగులు లాగినను రాలేదు. చివరకు ఆరాజు ఆనూతిని మూసిన బండకే పూజాదులు కావించుచుండెను. అది మొదలు రాజు లాడుబావా చెప్పినట్లు తన దేశమున హింసాదులు మాన్పించి, జనులు సన్మార్గులగు నట్లు చేసెను. ప్రతీ గ్రామము నందును

విష్ణుదేవాలయములు కట్టించి, విగ్రహప్రతిష్ఠలు జేసి త్రికాలములందును పూజలు జరుగునట్లును, శ్రీహరి భజనలు చేయునట్లును, భాగవతుల ఆరాధించునట్లును, శ్రీ హరికి ప్రీతికరమైన దినములలో జాగారము చేసి శ్రీహరిని భజించునట్లును చేసెను తానును ధర్మము తప్పకుండ రాజ్యపాలనము చేయుచు, దీనులను, సాధువులను, సజ్జనులను, భాగవతులను పోషించు చుండెను భక్త బృందములతో కలసి హరినామ సంకీర్తనము చేయుచు మహదానంద భరితుడగు చుండెను ఎల్లప్పుడు లాడుబావాను పొగడచుండెను. ఇట్ల పన్నెండేండ్ల గడచెను.

రాజు యొక్క జ్ఞానభక్తివైరాగ్యములకు పురుషోత్తముడు సంతసించి శంఖచక్రాది దివ్యాయుధములతోను, రత్నకిరీటమును ధరించి రత్నకుండలములతోనం, వనమాలికలను దాల్చి శ్రీవత్సలాంఛనములతోను పీతాంబరమును ధరించి, మహాలక్ష్మీ సమేతుడై, గరుడవాహనుడై ఆరాజుకు స్వప్నము నందు దర్శనమిచ్చెను. ఆరాజు ఆకలలోనే శ్రీమహావిష్ణువుకు సాష్టాంగ నమస్కారము చేసి నీవే నాతల్లివి, తండ్రివి, బంధువువవు స్నేహితుడవు. నా విద్యవు నీవే నాకు సర్వస్వము నీవే. నీవే కార్యకారణ స్వరూపుడు అమిత బలవంతుడవు. పురుషోత్తముడ వైన నీకు నమస్కారము నిన్ను తప్ప ఇతరుల గురించి చెప్పను ఇంకొకరి గురించి వినను ఆలోచించను తలచను. ఇతరులను భజించను ఒరులను ఆశ్రయించను. నీ పాద పద్మములు నాకు పూజనీయములు నేను నీ దాసుడనని స్తోత్రము చేసి, నీదివ్యస్వరూపమును పొగడుటకు వేయి నోర్లు కలవారికైన అసాధ్యము నేనెంతటి వాడనని ఆనంద బాష్పములు దొరలు చుండగా చేతులు జోడించి నిలువబడెను. భక్తపరాధీనుడైన ఆ పురుషోత్తముడు దయతో యిట్లనెను. నీజ్ఞాన భక్తివైరాగ్య గుణములకు మెచ్చి ప్రత్యక్షమైతిని. నీవు జన్మసాఫల్యమును పొందగలవు. అందుకు గురుకటాక్షము కావలయును. నీవు పరీక్షించుటకు నూతిలో తోసిన లాడుబావాను సద్గురువుగా శరణము వేడి అన్ని శుభములను పొందుము అనెను. రాజు భయముతో గడగడ వణకుచు స్వామీ! యిప్పటికి వారిని నూతిలోనికి త్రోసి పన్నెండు సంవత్సరములైనది. పడతోసిన మరునాడే వారిని బయటకుతీసి క్షమార్పణను కోరుదమను కొంటిని ఆ నూతిపై నున్న బండను ఎత్తుటకు ఎన్ని విధముల ప్రయత్నించినను సాధ్యము కాలేదు. ఆరోజు మొదలు ఆ బండనే లాడుబావా ప్రతినిధిగా భావించి నమస్కరించి పూజించి నైవేద్యాది వుపచారములు సమర్పించుచున్నాము. వారు చెప్పినట్లు దేశవాసులందరిని శ్రీహరి భక్తులుగా చేసినాను. మీరు యిప్పుడు అతని నుండి వుపదేశమును పొందుమనుచున్నారు. నాకు ఆమహాత్ముని దర్శన భాగ్యము ఎట్లు కలుగునని దీనముగా విన్నవించుకొనెను భగవంతుడు ప్రసన్నవదనముతో విచారించకుము నీవు ఆనూతి వద్దకు పోయి పూజాదులు చేసి పైన మూసిన బండను తీసిన మిగుల సులభముగా వచ్చునని చెప్పి అదృశ్యుడయ్యెను.

తరువాత ఆరాజు మేల్కొని మంత్రి పురోహితులతో తన స్వప్న వృత్తాంత మంతయు తెలిపెను. ఆబావి వద్దకు వెళ్ళి బండను పూజించి దానిని తాకినంతనే అది సులువుగా తొలగింపబడెను. అందు తేజోమయమైన లాడుబావాను చూచి స్తోత్రములను చేసి నమస్కరించి నిలువబడెను. లాడుబావా దయతో పరమ ఏ కాంత స్థలములో నున్న

నావద్దకేల వచ్చితివనెను. రాజు భగవంతుడు కలలో ఆజ్ఞాపించినదంతయు తెలిపి, మహాపరాధి అయినను తనను క్షమించి కరుణతో తమ పట్టణమునకు రావలసినదిగా వేడుకొనెను. లాడుబావా నవ్వుతూ నీవు అపరాధివి కావు. నన్ను పన్నెండు సంవత్సరములు సర్వదా భగవత్స్వరూపము నందే మనస్సు నిలిపి భగవదనుభవమును అనుభవింపజేసిన మహానుభావుడవు ఇట్టి మహోపకారము చేసిన నీకు నేను ఏమి ప్రత్యుపకారము చేయగలననెను. బావినుండి వెలుపలికి వచ్చిన లాడుబావాను రాజు రత్నములు పొదిగిన పల్లకీలో కూర్చుండ బెట్టి మంగళ వాయిద్యములతో తన పరివారముతో స్వగృహమునకు తీసుకొని వెళ్ళి ఉచితాసనమున కూర్చుండ బెట్టెను. జనులందరు కాంతిమయుడైన లాడాబావా దివ్యరూపమునకు సాష్టాంగ నమస్కారములు చేసిరి.

లాడుబావా రాజును చూసి నీవు చేసిన మంచి పనులు, నీకు భగవంతుని దర్శనము అయినదని నాహృదయమునకు తోచినది. నీకు భగవంతుని సాక్షాత్కారము కలుగును అని ఆశీర్వదించెను. ప్రజలార! మీరందరును నన్ను పరీక్షించుటకై పాడు నూతిలోనికి త్రోసితిరి. అనంత బ్రహ్మాండములన్నియూ ఎవని సంకల్పము చేత సృష్టింపబడి, ఎవని దివ్యశక్తిచే ధరింపబడినవో, సూర్యచంద్రాదులు ఎవని ఆజ్ఞమేరకు నిరంతరము కాలచక్రమునకులోబడి తిరుగుచున్నారో, ఎవని అణువంత దయలేనిచో బ్రహ్మాదులు ఏమియూ చేయలేక నిశ్చేష్టులై యుందురో, మీరును నేనును సర్వభూత జాలము ఎవని స్వరూపమై వున్నామో ఆపుండరీకాక్షుడు నన్ను రక్షించుచుండెను. సంసారసముద్రములో మునిగిన వారందరిని దరి చేర్చుటకు దీక్షబూనిన వానికి, ఒక భక్తుని రక్షించుట గొప్పకాదు. తనయందు మనసు నిలిపిన వారినందరి క్షేమమును తానే చూచుకొనునని నా మూలముగా మీ అందరికి చూపినాడు. ఆ భగవంతుని ఆజ్ఞకు వ్యతిరేకముగా ఎవరును ఏమియు చేయలేరు. సర్వము భగవంతుని ఆధీనమని అతని ఆజ్ఞప్రకారమే సర్వము జరుగునని ఎరుగుడని ప్రజలకు బోధించెను.

తరువాత రాజు అతని పాదములపై తనతల నుంచి శరణాగతిని వేడెను. లాడుబావా పరమార్థమైన శ్రీకృష్ణ మంత్రమును రాజుకు వుపదేశించి ఆ మంత్ర ఉపాసనారీతిని వివరించెను. శ్రీమన్నారాయణుని స్మరించినంత మాత్రము ననే సకల పాప మోహక్లేశములు తాపత్రయములు నశించునని హితోపదేశము చేసెను. రాజు వలెనె ఆదేశప్రజలందరు ఆ ఆచార్యుని పాదములనాశ్రయించి వుపదేశమును పొందిరి శ్రీహరి భజనను, ఏకాదశవ్రతమును ఆచరించుచుండిరి. లాడుబావా కొన్నిదినములు అచటనుండి తరువాత బయలుదేరి దివ్య తీర్థములు క్షేత్రములు చూచి తన స్వస్థానమునకు చేరి శ్రీహరి సంకీర్తనములను చేయుచు అవసానమున పరమ పదమును పొందెను. మరికొన్ని రోజులకు రాజునకు భగవంతుడు ప్రత్యక్షమై అభయప్రదానము చేసెను. ఈ విధముగా ఆచార్యోపదేశ మహిమచే ఆరాజును, ప్రజలను భక్తియుక్తులై వారి అవసానానంతరము లాడుబావాను చేరిరి.

# మాతృ ఆశ్రమ వార్తలు

పూజ్యశ్రీ ఓంకార స్వామివారి 128వ జన్మదినము.

**19-01-2022 బుధవారం ఉదయం 5.45 గం॥లకు**

శాంతి గణపతి సన్నిధిలో దీపప్రజ్వలనము చేసి - ఓంకార స్తూపములో ఓంకార స్వామి విగ్రహమును పుష్పమాలాంకృతుని చేసి నగర సంకీర్తన చేసారు.

ప్రార్ధనా మందిరంలో ప్రార్ధన జరిపి అన్నపూర్ణాదేవి సదనంలో అన్నపూర్ణకు పూజలు చేశారు.

**ఉదయం 6.00 గం॥ ల నుండి సాయంత్రం 6.00 గం॥ల వరకు జయ జయ రామకృష్ణ హరి ఓం నామ సంకీర్తనం ఆశ్రమవాసులచే జరుపబడినది.**

**20-01-2022 గురువారం దిగువ ప్రార్ధనా మందిరమందు**

ఉదయము 6 గం॥ల నుండి సాయంత్రం 6 గం॥ల వరకు **ఓంకార** (ప్రణవ) జపం ఆశ్రమ వాసులచే జరుపబడింది.

**21-01-2022 శుక్రవారం**

శాంతి గణపతి సన్నిధి నుంచి ఉదయం 6 గం॥లు నగర సంకీర్తనతో ఓంకార మందిరమునకు ఆశ్రమవాసులు చేరిరి.

ఉదయము 7గం॥లకు ఓంకార మందిరము నందు పూజ్యశ్రీ ఓంకార స్వామీజీ వారి పాదుకా శతనామార్చన జరిగినది. తదుపరి పూజ్యశ్రీ జ్ఞానేశ్వరీ మాతాజీ గారు దివ్య దర్శనము ఇచ్చారు.

ఉదయం 6 గం॥ల నుండి సాయంత్రం 6 గం॥ల వరకు ఆశ్రమ వాసులచే శాంతి ప్రార్ధన పారాయణం జరిగినది.

సాయంత్రం 6 గం॥ల నుండి 7 గం॥ల వరకు సామూహిక ధ్యానము జరిపిరి. తదుపరి ప్రసాద వితరణము జరిగినది.

# దాతలకు విజ్ఞప్తి

దివ్యాత్మ స్వరూపులకు సూచన. శ్రీ శాంతి ఆశ్రమమునకు విరాళము ధన రూపంలో / చెక్కు / ఎస్.బి.ఐ, కత్తిపూడి, అకౌంట్ నెం. 11003309435కు ఆన్‌లైన్ ద్వారా పంపగలరు. మీ విరాళములకు ఇన్‌కమ్‌ట్యాక్స్ 80జి రాయితీ కలదు. మీరు ఏ విధంగా విరాళము పంపినను వ్రాత పూర్వకంగా లేదా ఇమెయిల్ ద్వారా లేదా మొబైల్ నంబరు 7382009962కు మీ పేరు, చిరునామా మీ మొబైల్ నంబరు తెలుపగలరు.

# శాంతి పత్రిక చందాదారులకు విజ్ఞప్తి

శాంతి పత్రిక ప్రతినెలా 1,2 & 3 తేదీలలో పోస్టు చేయబడును.

సం॥ర చందా రూ. 100/-, జీవిత చందా రూ. 1000/- (12 సంవత్సరముల వరకు మాత్రమే), ఎమ్.ఓ/స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కత్తిపూడి అకౌంట్ నెం. 11003309435, ఆన్‌లైన్ ద్వారా ఈ క్రింది చిరునామాకు పంపగలరు.

ఎమ్.ఓ.ఫారమ్‌లో దిగువ ఫర్ కమ్యూనికేషన్ భాగములో మీ పూర్తి చిరునామా వ్రాయాలి. తదుపరి క్రొత్త చందా లేక పాత చందా అనునది క్లుప్తముగా వ్రాయాలి. పాత చందా అయితే చందాదారు సంఖ్య వ్రాయాలి.

చందాకాలం ముగింపుకు నెలముందే రెన్యువల్ చేసుకొనవలెను. మీ అడ్రస్ మార్పు జరిగితే, ఉత్తరము ద్వారా తెలుపుతూ చందా నెంబరు వ్రాయాలి. చందా వివరములు తెలుపని యెడల సొమ్ము విరాళముగా జమచేయబడును.

కార్యదర్శి, శ్రీ శాంతి ఆశ్రమం (పోస్ట్)

వయా శంఖవరం - 533 446, తూ.గో.జిల్లా

# విన్నపము

విదేశములలో వుండు ఆశ్రమ భక్తులు విరాళములు ఈ క్రింది ఎఫ్.సి.ఆర్.ఎ (Foreign Contributions Regulation Act) బ్యాంక్ అకౌంట్‌కు తమ యొక్క నివసించే ప్రాంతములోని తమ బ్యాంక్ అకౌంట్ నుండి ఆదేశ కరెన్సీలో పంపగలరు. పంపిన పిదప వివరములు srisanthiashram@gmail.com అనే మెయిల్ ఐడికి మరియు mattavvs07@gmail.com కి తప్పకుండా పంపవలెను.

బ్యాంకు పేరు :State Bank of India, 11 Sansad Marg, New Delhi-110001

A/c Name : THE MISSION OF PEACE - FCRA A/c No : 40127798428
Swift Code : SBININBB104

**1. మాతృ ఆశ్రమం**
శ్రీ శాంతి ఆశ్రమము
తోటపల్లి కొండలు, పిన్ : 533 446.
వయా శంఖవరం, తూ.గో.జిల్లా.
సెల్ : 7382009962
రిసెప్షెన్ : 6305349677
e-mail:srisanthiashram@gmail.com

**2. విశాఖ : శాంతి ఆశ్రమము**
లాసన్స్‌బే, పెదవాల్తేరు – 530 017
విశాఖపట్నం.
ఫోన్ : 0891 – 2538689
e-mail : srisanthiashramvsp@gmail.com

**3. విశ్వశాంతి క్షేత్రం**
కైలాసగిరి, విశాఖపట్నం

**4. కోటగిరి శాఖ**
పీస్ సెంటర్, డార్‌మోనా రోడ్,
కోటగిరి – 643217, నిలగిరి జిల్లా.
తమిళనాడు.
ఫోన్ : 04266–271945
e-mail : vsvmsktg@yahoo.com
vsvmsktg@gmail.com

**5. కాకినాడ శాఖ**
శాంతి ఆశ్రమము, అశోక్ నగర్
కాకినాడ – 533 004.
తూ.గో.జిల్లా

**6. పిఠాపురం శాఖ**
స్టువర్టు పేట,
పిఠాపురం–533 450. తూ.గో.జిల్లా.

**Website : www.srisantiashram.org**

## కార్యక్రమములు - మాతృ ఆశ్రమం

**తేది 5-2-2022 (శనివారం)** శ్రీ పంచమి సందర్భంగా ఉ॥ 9 గం॥లకు గురుకుల పాఠశాలలో శ్రీ సరస్వతి పూజ జరుపబడును.

**తేది 8-2-2022 (మంగళవారం)** "రథసప్తమి" సందర్భంగా ఉ॥ 7 గం॥లకు శ్రీ సూర్య అష్టోత్తర శతనామార్చన.

**తేది 12-2-2022 (శనివారం)** "భీష్మ ఏకాదశి" సందర్భంగా ఉ॥ 7.30గం॥లకు శ్రీ కృష్ణ అష్టోత్తర శతనామార్చన, భీష్మ కృత కృష్ణ స్తుతి.

**తేది 18-2-2022 (శుక్రవారం)** శ్రీరామకృష్ణ పరమహంస జయంతి.

**తేది 25-2-2022 (శుక్రవారం)** అవతార్ మెహర్‌బాబా జయంతి.

# శాశ్వత అన్నదానం

1. శ్రీ తేతలి రామకృష్ణారెడ్డి గారు (కాకినాడ) 5000/-
వీరి తల్లి గారు శ్రీమతి సుబ్బయమ్మ గారి జ్ఞాపకార్థం
2. శ్రీ సత్తి మహేశ్వరరావు గారు (కాకినాడ) 5000/-
వీరి పుట్టినరోజు సందర్భముగా
3. శ్రీ బాలేపల్లి రాంప్రసాద్‌గారు(తుని) 5000/-
వీరి తండ్రిగారు కీ॥శే॥ బి. రాంబాబు గారి జ్ఞాపకార్థం
4. శ్రీ పాలపర్తి హరికుమార్ శర్మ గారు (శాంతి ఆశ్రమం) 5000/-
వీరి తల్లిగారు శ్రీమతి శారదదేవి గారి జ్ఞాపకార్థం
5. శ్రీ జె. రామకృష్ణగారు (భీమవరం) 5000/-
బాబాజీ గురూజీ గారి జయంతి సందర్భముగా
6. శ్రీ కె.వి. ప్రభాకర్ గారు (హైదరాబాద్) 5000/-
వీరి తల్లిగారు శ్రీమతి కుంటల ఈశ్వరమ్మగారి జ్ఞాపకార్థం
7. రేష్మీ కిరణ్ గారు డాటర్ ఆఫ్ కిరణ్‌సింగ్ గారు (హైదరాబాద్) 5000/-
వీరి పుట్టినరోజు సందర్భముగా
8. శ్రీ ప్రదీప్ చోడగం గారు (నాగపూర్) వీరి తల్లిగారు శ్రీమతి సాధుమణిగారు 5000/-
వీరి తండ్రిగారు శ్రీ రాజేంద్ర రావు గార్ల జ్ఞాపకార్థం

## విరాళములు

1. శ్రీ కొల్లి ప్రసాద్ గారు (శాంతి ఆశ్రమం) 8000/-
2. శ్రీ సందీప్ బాసక్ గారు & శ్రీ ప్రదీప్ బాసక్ గారు (కోల్‌కత్తా) 10,000/-
వీరి తల్లిగారు కమల్ బాసక్ గారి జ్ఞాపకార్థం అన్నదానం
3. శ్రీ ద్వారంపూడి వెంకటరెడ్డి గారు (శాంతి ఆశ్రమం) 5000/-
పూజ్యశ్రీ పరమహంస యోగానంద గారి
పుట్టినరోజు సందర్భముగా అన్నదానం
4. శ్రీ తణుకు రామకృష్ణ జనార్ధనరావు గారు, గోగ్రాసం నిమిత్తం 20,000/-
5. శ్రీమతి ఈమని శేషారత్నం గారు (హైదరాబాద్) విద్యార్థుల సంక్షేమం 5000/-
6. శ్రీ మంతెన కృష్ణం రాజు గారు (శరభావరం) గోగ్రాసం నిమిత్తం 15500/-
7. శ్రీ భరతుల కృష్ణరాం గారు (ఢిల్లీ) సోలార్ సిస్టం నిమిత్తం 14336/-
8. శ్రీ పూజ్య జపానందస్వామి వారు (శాంతి ఆశ్రమం) 30000/-
9. శ్రీమతి పైడా రజనీరావు గారు,
శ్రీ పి.శ్రీరామ కృష్ణయ్య గారు (కాకినాడ) 3000/-
స్వామీజీ జన్మదినం నిమిత్తం వస్త్రదానం - అన్నదానం
10. శ్రీ శర్మ పురుషోత్తం గారు 10000/-

| | | |
|---|---|---|
| 11. | శ్రీమతి పి. సావిత్రిగారు గోపూజ నిమిత్తం | 6000/- |
| 12. | శ్రీమతి ఎస్. కాంతమ్మగారు (రాజమండ్రి) గోపూజ నిమిత్తం | 5000/- |
| 13. | శ్రీ వి. సత్యనారాయణ శ్రీమతి వి. శాంత కుమారి గారు (హైదరాబాదు) అన్నదాన నిమత్తం | 3000/- |
| 14. | శ్రీ మర్రి కృష్ణారెడ్డి మెమోరియల్ ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ (హైదరాబాదు) | 5000/- |
| 15. | శ్రీ జి.పి. మల్లిఖార్జున గారు | 5000/- |
| 16. | ది కాకినాడ పోర్టు వర్కర్సు పూల్ (కాకినాడ) అన్నదానం నిమిత్తం | 6000/- |
| 17. | శ్రీమతి ఎన్. లక్ష్మీదేవి గారు (హైదరాబాద్) గోగ్రాసం మరియు పూజ్య స్వామిజీ జన్మదినం నిమిత్తం వస్త్రదానం - అన్నదానం | 30,000/- |
| 18. | శ్రీ వుండవల్లి బాపిరాజుగారు (కాకినాడ) గోగ్రాసం నిమిత్తం | 52000/- |
| 19. | శ్రీ ఎమ్. సుధాకర్ గారు (రాజమండ్రి) వీరి జన్మదినము నిమిత్తం అన్నదానం | 3000/- |
| 20. | శ్రీ శిద్దానంద గిరి స్వామి వారు (శాంతి ఆశ్రమం) గోగ్రాసం నిమిత్తం | 14001/- |
| 21. | శ్రీ ఎ.ఎమ్.శర్మగారు (ముంబాయి) గోగ్రాసం నిమిత్తం | 3000/- |
| 22. | శ్రీమతి పుష్పాల సుబ్బలక్ష్మి గారు (పెద్దాపురం) స్వామి పుట్టినరోజు సందర్భముగా మరియు శ్రీ భగవాన్ మాస్టారి జ్ఞాపకార్థం, అన్నదానం | 5000/- |
| 23. | శ్రీమతి వి. రాజేశ్వరి గారు (విశాఖపట్నం) | 4000/- |

## నిజమైన వెలుగు

మనం ఊహించని కష్టం ఒక్క మారుగా వచ్చిపడినప్పుడు
మనల్ని మనం మరచి రెచ్చిపోతే మన ప్రాబల్యం కుచించుకుపోతుంది
సగం చీకటిలోనే మగ్గిపోతాం కష్టతరమైన పరిస్థితులు ఏర్పడతాయి
అవి జన్మంతా మనల్ని విడిచిపోవు అందువలనే లోపం ఎక్కడ?
ఏకాంతంగా, ప్రశాంతంగా హృదయాన్ని ప్రక్షాళన చేయాలి
ఆగ్రహం చల్లబడుతుంది మనపై మనకు విముఖత తగ్గుతుంది
నిజమైన వెలుగులో అసలైన పరిష్కారం తెలిసి వస్తుంది.

**ఎమ్.ఎస్. రంగారావు (బన్ను)**

This Periodical is Registered with Registrar of Newspapers, New Delhi Vide R.No. 3447/57, Dt. 18-12-20 Permitted to Post Under Concessional Postage Vide AP/KD-24/2021-2023

## SRI SANTI ASHRAM ENGLISH PUBLICATIONS

1. Auto Biography of Swami Omkar (2 Volumes) .......... Rs. 150/-
2. Life and Teachings of Swami Omkar .......................... Rs. 10/-
3. Soham .......................................................... Rs. 10/-
4. Cosmic Fast ....................................................Rs. 20/-
5. Meditation......................................................Rs.10/-
6. Om Japa ........................................................Rs.10/-
7. Control of Mind ...............................................Rs.30/-
8. Cosmic Flashes ...............................................Rs.10/-
9. In the Hours of Silence ....................................... Rs.10/-
10. The Soul of Omkar ...........................................Rs.10/-
11. How I learned English .......................................Rs.10/-
12. Reincarnation of my Little Sister ..........................Rs.10/-
13. God Realization Now and Here ............................Rs.10/-
14. Mystic Prayers and Poems ..................................Rs.20/-
15. The Divine Voice of Omkar .................................Rs.40/-
16. Auto Biography of Omkar (Revised Edition) .............Rs.100/-
17. Petals of Peace ...............................................Rs.20/-
18. The Story of my life and Work ..............................Rs.10/-
19. Priceless legacy of Swami Omkar ...........................Rs.10/-
20. The Four Initiations .........................................Rs.10/-
21. Musings ........................................................Rs.20/-
22. Peace Prayer ...................................................Rs.20/-

THE MISSION OF PEACE
శ్రీ శాంతి ఆశ్రమము
పోస్టు : శాంతి ఆశ్రమము
(వయా) శంఖవరం - 533 446.
తూ॥గో॥జిల్లా., (ఆ.ప్ర.)
ఫోన్ : 7382009962
email:srisanthiashram@gmail.com
www :www.srisantiashram.org.in

Printed Book

To

Printed by Padmanabha Offset Printers and Published by Swamini Vinamrananda on behalf of The Mission of Peace Sri Santi Ashram and Printed at Padmanabha Off-set Printers, Kakinada - 533 004 Cell : 93979 50719 and Published at Thotapalli Hills 533 446 Ph : 7382009962 Editor : Swamini Vinamrananda.